

భోజన ప్రియుడు తిరుమల వెంకన్న





- వివరాలు 8వ పేజీలో -

శ్రీవారి దర్శనంతో అద్భుతమైన అనుభూతి



● ప్రముఖ నటి హేమమాలిని

తిరుమల, నవంబరు2(ఆంధ్రజ్యోతి): సీనియర్ నటి, బీజేపీ ఎంపీ హేమమాలిని తన కుమార్తె ఈషాతో కలసి శనివారం తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డితో కలిసి వారు ఆలయంలోకి వెళ్లారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలవిరాట్టును దర్శించుకున్నారు. అనంతరం హేమమాలిని ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. తిరుమలకు రావడం అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు.తిరుమలలో పరిశుభ్రత, ప్రకృతి అందాలు అద్భుతంగా ఉంటాయన్నారు. తాను చాలా సార్లు శ్రీవారిని దర్శించుకున్నానని, ఈసారి మరింత అద్భుతమైన అనుభూతి కలిగిందన్నారు.ఈషా దేవోల్ మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచి తాను చాలా సార్లు తిరుమలకు వచ్చి స్వామిని దర్శించుకున్నట్టు తెలిపారు. ఈసారి తన తల్లితో దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు.

కొండ కిటకిట

తిరుమలలో భక్తుల రద్దీ భారీగా పెరిగింది. వరుస సెలవుల నేపథ్యంలో తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. గురు, శుక్రవారాల్లో ఖాళీగా కనిపించిన కొండ శనివారం కిక్కిరిసింది. అలిపిరి నుంచి శ్రీవారి ఆలయం వరకు ఎక్కడ చూసినా భక్తులే కనిపించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



పసిమొగ్గను చిదిమేసిన మానవ మృగం

ముక్కు పచ్చలారని ఓ చిన్నారి బతుకును చిదిమేసిందో మానవమృగం. కన్నూమిన్నూ కానక ఓ కామాంధుడు లైంగికదాడికి పాల్పడి అమానుషంగా హత్యచేసిన వైనంతో జిల్లా ప్రజానీకం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. రెక్కాడితే గాని డొక్కాడని ఓ పేద కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపిన ఈ అమానవీయ ఘటనపై తీవ్ర ఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్నాయి. కేవీబీపురం మండలానికి చెందిన నిరుపేద దంపతులకు బాబు, పాప ఉన్నారు. పాపకు మూడేళ్లు. ఉన్న ఊరిలో బతకడానికి సరైన దారిలేక ఈ మధ్య భార్య పుట్టిన వడమాలపేట మండలానికి వచ్చారు. అక్కడే కూలిపనులు చేసుకుంటూ బతుకుతున్నారు.

- పుత్తూరు అర్బన్, కేవీబీపురం, వడమాలపేట (ఆంధ్రజ్యోతి)



- ● మూడేళ్ల చిన్నారిపై రాక్షసకృత్యం
- ● లైంగికదాడిచేసి అమానుషంగా హత్య
- ● నిందితుడ్ని అరెస్టు చేసిన పోలీసులు
- ● రూ.10లక్షలు ప్రకటించిన ప్రభుత్వం
- ● నేడు చిన్నారి తల్లిదండ్రుల పరామర్శకు హోంమంత్రి
- ● దారుణ సంఘటనపై సర్వత్రా ఆగ్రహం

ఆనందం అంతలోనే ఆవిరి

శుక్రవారం పిల్లలతో దీపావళి పండుగ జరుపుకోవాలని ఆ దంపతులు ఎంతో ఆనందంగా ఉన్నారు. చిన్నారి తండ్రి తనకున్న ఆర్థిక స్థోమత మేరకు బాణసంచా తెచ్చాడు. తర్వాత పొరుగూరికి వెళ్లాడు. ఇంతలోనే చిన్నారి కనిపించడం లేదంటూ అతనికి భార్య తల్లి ఫోన్ చేసింది. బాగా వెతుకు.. భయపడవద్దంటూ ఫోన్‌లోనే ధైర్యం చెప్పాడు. వెంటనే ఇంటికి చేరుకున్నాడు. ఊరంతా బాలిక కోసం జల్లెడ పట్టారు. అయినా కనిపించకపోయేసరికి తీవ్ర ఆందోళనకు గురయ్యారు. శుక్రవారం మధ్యాహ్నం మద్యం తాగి ఇంటికి వచ్చిన సుశాంత్ చిన్నారిని తీసుకెళ్లాడని గుర్తుకు తెచ్చుకున్నారు. అతడిని ఆరా తీసినా తనకేమీ తెలియదంటూ బుకాయించాడు. దీంతో తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగారు. సుశాంత్‌ను విచారించేసరికి ఘాతుకం బయటపడింది.

ఈ మానవమృగం బంధువే

ఈ దంపతులకు దగ్గర బంధువైన యువకుడు సుశాంత్(22) ఇటీవల బెంగళూరు నుంచి కాలనీలో ఉంటున్న పెదనాన్న ఇంటికి వచ్చాడు. కొన్ని రోజులుగా పనులకు వెళ్లకుండా మద్యం తాగుతూ ఖాళీగా తిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం సుశాంత్ చాక్లెట్ ఆశ చూపించి చిన్నారిని తనతో తీసుకుపోయాడు. ఎవరూ లేని ప్రదేశంలో లైంగిక దాడికి పాల్పడి దారుణంగా హతమార్చి మురికికాల్వలో పూడ్చేశాడు. తమ గారాలపట్టి కనిపించకపోయేసరికి తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. కొన్ని గంటల తర్వాత తెలిసిన దుర్మార్గుడి ఘాతుకంతో నిశ్చేష్టులయ్యారు.



సీఐటీయూ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

అండగా ప్రభుత్వం : ఎమ్మెల్యే భానుప్రకాష్

చిన్నారిని హత్యాచారం ఘటనపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారని ఎమ్మెల్యే భానుప్రకాష్ తెలిపారు. బాధిత కుటుంబానికి పూర్తి అండగా ఉంటామని తెలిపారు. నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామన్నారు. మృతురాలి కుటుంబ సభ్యులను పుత్తూరు, వడమాలపేట మండలాల నాయకులు గంజి మాధవయ్య, ధనంజయులునాయుడు, లోకరాజు, జీవరత్నం నాయుడు, కరుణాయాదవ్, షణ్ముగరెడ్డి, తదితరులు ఓదార్చారు. చిత్తూరు పార్లమెంట్ అధ్యక్షుడు రాజన్ రూ.20 వేలు, పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు కార్జాల అరుణ రూ.5 వేలు ఆర్థికసాయం అందించారు. సంఘటనను ఖండిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో పుత్తూరు పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మాజీ మంత్రి రోజాతో పాటు వైసీపీ నాయకులు నారాయణస్వామి, కరుణాకరరెడ్డి, మునివేలు, జయప్రకాష్, చిన్నా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.



బాలిక అంతిమయాత్ర

ఊరంతా విషాదం

నిందితుడు సుశాంత్‌ను అరెస్టు చేసి, చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. శనివారం పుత్తూరులో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని పోలీసు బందోబస్తు మధ్య ప్రత్యేక వాహనంలో స్వగ్రామానికి చేర్చారు. చిన్నారి మృతదేహాన్ని చూసి ఊరంతా కన్నీటిపర్యంతమయ్యారు.
కాలనీ విషాదంలో మునిగిపోయింది. చిన్నారి తల్లి స్పృహతప్పి పడిపోయింది. వారిని ఓదార్చడం ఎవరి వల్ల కాలేదు. గ్రామస్తులే చిన్నారికి అంత్యక్రియలు నిర్వహించారు.
గ్రామంలో సీఐ భాస్కర్‌నాయక్, ప్రత్యేక పోలీసు దళం, కేవీబీపురం పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



నిందితుడు సుశాంత్

నేడు హోం మంత్రి రాక

నిందితుడిని కఠినంగా శిక్షించాలని పోలీస్ అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. బాలిక కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. బాధిత బాలిక కుటుంబాన్ని పరామర్శించేందుకు హోంమంత్రి వంగలపూడి అనిత ఆదివారం రానున్నారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.10 లక్షలను ఆమె అందజేయనున్నారు. ఇది హేయనీయమైన చర్యగా అనిత అభివర్ణించారు. స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్పందిస్తూ ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా నిందితుడికి కఠిన శిక్షపడేలా ప్రయత్నిస్తామని తెలిపారు. ఈ కేసును చాలా తీవ్రంగా పరిగణించినట్లు ఎస్పీ సుబ్బరాయుడు చెప్పారు. ప్రభుత్వ స్పందన, సంఘటన తీవ్రతను గుర్తించిన జిల్లా అధికారులు హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ రామ్మోహన్ తదితరులు చిన్నారి కుటుంబానికి ధైర్యం చెప్పారు. నిందితుడిని కఠినంగా శిక్షిస్తామన్నారు. ప్రభుత్వం అన్ని విధాలా సాయంగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. క్లూస్ టీం రంగంలోకి దిగి ఆధారాలను సేకరించారని ఎస్పీ చెప్పారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా, పీడీ ట్రైల్ చేసి కఠిన చర్యలు చేపడతామన్నారు. కాగా చిన్నారిని అమానుషంగా హత్యచేసిన నిందితుడిని తమకు అప్పగించాలంటూ గ్రామస్తులు, బంధువులు ఎస్పీ సుబ్బారాయుడు ఎదుట వాపోయారు. గ్రామానికి వచ్చిన ఎస్పీ వద్ద వారంతా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు.

మహిళల కళ్లలో ఆనందం కోసమే దీపం పథకం

ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసిన మంత్రి నాదెండ్ల

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో ఎన్నో ఇబ్బందులు పడిన మహిళల కళ్లలో ఆనందం కోసమే దీపం పథకం తీసుకొచ్చినట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. తిరుపతిలోని చెన్నారెడ్డి కాలనీలో శనివారం లబ్ధిదారులకు దీపం పథకం కింద మంత్రి ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఉచిత సిలిండర్లు బుక్ చేసిన వెంటనే ఇంటి వద్దకు వస్తుందన్నారు. ధర చెల్లించిన 24 గంటల్లోనే లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బు జమవుతోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తామన్నారు. టీడీపీ తిరుపతి పార్లమెంటు ఇన్‌చార్జి నరసింహయాదవ్ మాట్లాడుతూ ఎన్నికల హామీలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ మాట్లాడుతూ గత ఐదేళ్ల రాక్షస పాలనలో మహిళలు అభద్రతా భావంతో బతికారని, ఇప్పుడు స్వేచ్ఛగా ఉంటున్నారని తెలిపారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ మాట్లాడుతూ అర్హత ఉండి ఉచిత సిలిండర్ అందకుంటే వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. కమిషనర్ మౌర్య, టీడీపీ తిరుపతి నేత ఆరణి శివ మాట్లాడారు. అనంతరం మంత్రి గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ బాయ్స్‌తో ఫొటోలు దిగారు. కార్యక్రమంలో రైల్వే కోడూరు ఎమ్మెల్యే శ్రీధర్, జనసేన జిల్లా ఇన్‌చార్జి పసుపులేటి హరిప్రసాద్, టీడీపీ అధికార ప్రతినిధి శ్రీధర్ వర్మ, కూటమి నాయకులు ఊకా విజయ్‌కుమార్, కిరణ్‌రాయల్, కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, రేవతి, నారాయణ, పుష్పావతి, బుల్లెట్ రమణ, ఆముదాల తులసీరాం, సింగం శెట్టి సుబ్బరామయ్య, శ్రీనివాసులు, ఊట్ల సురేంద్ర నాయుడు, అజయ్‌కుమార్, వరప్రసాద్, ఆకేపాటి సులోచన, డీఎస్‌వో శేషాచలం రాజు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సిలిండర్ అందజేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

అర్ధరాత్రి రుయాలో హల్‌చల్

- ● మద్యం మత్తులో కారులో దూసుకువచ్చిన యువకులు
- ● అడ్డుకున్న పోలీసులు, సెక్యూరిటీ సిబ్బందిపై దాడికి యత్నం



డివైడర్‌ను ఢీకొట్టిన కారు - గాయపడిన మునిశేఖర్

తిరుపతి(వైద్యం), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఇద్దరు యువకులు అతివేగంగా కారు నడుపుతూ రుయాస్పత్రిలోకి దూసుకొచ్చిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తాతయ్యగుంటకు చెందిన దాము, మునిశేఖర్ పూటుగా మద్యం తాగి కారులో వేగంగా రుయాస్పత్రిలోకి దూసుకెళ్లారు. అడ్డుకునే ప్రయత్నం చేసిన సెక్యూరిటీ సిబ్బందిని లెక్క చేయకుండా ముందుకు వెళ్లి డివైడర్‌ను ఢీకొట్టారు. ఆ సమయంలో అక్కడ రోగులు, సహాయకులు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కారు డివైడర్‌ను ఢీకొట్టిన శబ్దానికి అక్కడున్న వారు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. అవుట్ పోస్టులోని పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించగా కారులో పక్క సీట్లో కూర్చున్న మునిశేఖర్ తలకు గాయం కాగా నడుపుతున్న దాముకు స్వల్ప గాయాలయ్యాయి. కారును అక్కడే విడిచిపెట్టి పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు వాగ్వాదానికి దిగారు. దాడి చేసేందుకు తెగబడ్డారు. అదుపులోకి తీసుకొని వెస్ట్ పోలీసులకు అప్పగించారు. స్టేషన్‌కు తీసుకువెళ్లిన గంట వ్యవధిలోనే ఆ ఇద్దరు యువకులు తిరిగి రుయాస్పత్రికి చేరుకుని 'మమ్మల్నే పోలీసులకు పట్టిస్తారా.. మీ అంతు చూస్తాం' అంటూ బెదిరించారు. అనంతరం సెక్యూరిటీ సిబ్బంది వారికి నచ్చజెప్పి పంపించారు. డ్రంకన్ డ్రైవ్ కేసు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాలాజీ డివిజన్ కల ఫలించేనా?

◆ రైల్వే ప్రాజెక్టులపై రేపు పార్లమెంటరీ కమిటీ సమావేశం

తిరుపతి(సెంట్రల్) నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): భారత రైల్వేలో గ్రేడ్-1 రైల్వేస్టేషన్లలో తిరుపతి ఒకటి. అయితే ఇక్కడ బాలాజీ డివిజన్ ఏర్పాటు కలగానే మిగిలింది. సోమవారం తిరుపతిలో రైల్వే ప్రాజెక్టులపై జరగనున్న పార్లమెంటరీ కమిటీ సమావేశంలో దీనిపై చర్చించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- ● తిరుపతి-రేణిగుంట మధ్య మూడవ రైలు మార్గం ఏర్పాటు చేయాలి.
- ● రేణిగుంట జంక్షన్‌ను మరో టెర్మినల్ చేయాలి.
- ● బాలాజీ డివిజన్ ఏర్పాటు చేయాలి.
- ● చంద్రగిరి రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాలి.
- ● సీఆర్ఎస్ సామర్థ్యం పెంచాలి.
- ● తిరుపతి వెస్ట్ రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాలి.
- ● పాకాల జంక్షన్‌లో అభివృద్ధి పనులు చేపట్టాలి.

చెక్ పోస్టు ఏర్పాటుకు స్థల పరిశీలన



చంద్రగిరి, నవంబరు 2: పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలో గాదంకి టోల్ ప్లాజా వద్ద చెక్ పోస్టు ఏర్పాటు కోసం మండలంలోని పాకాల వారిపల్లె వద్ద పోలీస్ ఉన్నతాధి కారులు శనివారం స్థలాన్ని పరిశీలించారు. ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ఏఎస్పీ మనోహరాచారి, డీఎస్పీ ప్రసాద్, చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డి స్థలాన్ని పరిశీలించారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు అక్రమంగా తరలి వెళుతున్న ఇసుకను అడ్డుకొనేందుకు పటిష్ట నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయడం కోసం చెక్ పోస్టును ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ముక్కోటి వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు

చంద్రగిరి, నవంబరు 2: తొండవాడ సమీపంలోని అగస్త్యేశ్వరాలయం (ముక్కోటి) నుంచి పీలేరు, తిరుపతి జాతీయ రహదారిలోకి వెళ్లే మార్గంలో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రమాదాల నివారణకు చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్, చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డి, ఎంఆర్‌పల్లె సీఐ చిన్నగోవింద్ ఆ రోడ్డును పరిశీలించారు. చంద్రగిరి నుంచి తిరుపతికి వెళ్లేందుకు, ముక్కోటి నుంచి పీలేరు- తిరుపతి జాతీయ రహదారి మీదుగా పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిలోకి వాహనదారులు వెళుతుంటారు. ఈ క్రమంలో ముక్కోటి వద్ద నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో డీఎస్పీ ప్రసాద్ రోడ్డును పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన సూచనలు చేశారు.

సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు



పాకాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక క్రైస్తవుల సమాధి తోటలో శని వారం క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆల్ సోల్స్‌డే పురస్క రించుకొని రోమన్ క్యాథలిక్ మిషన్ చర్చ్, సెయింట్ పాల్స్ సీఎస్ఐ చర్చి సంఘస్తులు తమ పెద్దలు, ఆత్మీయులు, కుటుంబ సభ్యుల సమాధులను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి క్యాండిల్స్ వెలిగించారు. ఫాదర్ ఆంథోని రాజ్, పాస్టర్ ప్రేమ్ కుమార్‌లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాత్రి వరకు సమాధుల తోటలో సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో సీఎస్ఐ కార్యదర్శి విక్టర్ ఎం.రాఘవేలు, ట్రెజరర్ జి.అరుళ్ సెల్వి పాల్గొన్నారు.

ఇంటింటికీ చెత్తబుట్టల పంపిణీ



తిరుచానూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు గ్రామ పంచాయతీ అధికారులు తడి చెత్త పొడి చెత్త వేసుకోవ డానికి ఇంటింటా రెండు చెత్తబుట్టలు శనివారం పంపిణీ చేశారు. రూరల్ ఈవో పీఆర్డీ, తిరుచానూరు పంచాయతీ కార్యదర్శి మాధురి ఆధ్వర్యంలో వీటిని అందజేశారు. పారిశుధ్య కార్మికులకు చెత్త అందించి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిల్ కలెక్టర్ రమేష్, మేస్త్రీ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

తిరుచ్చి వాహనంపై కల్యాణ వెంకన్న విహారం



చంద్రగిరి, నవంబరు 2: శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి శనివారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేతుడై భక్తులకు దర్శనమిచ్చారు. నిత్య సేవల్లో భాగంగా ఆలయంలో ఉదయం స్వామివారి సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్య కట్ల కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లను కల్యాణ మండపంలో వేంచేపు చేసి, ఆగమ శాస్త్రోక్తంగా ఉత్సవర్లకు కల్యాణోత్సవం నిర్వహించారు. పెరటాసి నెల మూడవ శనివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయ ఆవరణలో ఊంజల్ సేవ కన్నులపండువగా నిర్వహించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లను విశేషంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై మాడ వీధుల్లో ఊరేగించారు. ఈకార్యక్రమాలలో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, రమేష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు బాలాజి రంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారథి, జమేదర్ చిరంజీవి, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.



కళ్లు 'తెర'వండి

కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో చిత్తూరు నగరంలోని గంగినేని చెరువు పార్కులో ఎల్‌ఈడీ తెరను ఏర్పాటు చేశారు. గాలితో కాలుష్యం ఎంత మేరకు ఉందో దీనిపై ప్రదర్శించాల్సి ఉంది. గాలిలో తేమ, విష వాయువుల శాతం, శబ్ద తీవ్రతను తెలుసుకుని అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది. ఈ తెర చాలా రోజులుగా పనిచేయకపోవడంతో నగరంలో కాలుష్యం ఎంత ఉందో ప్రజలకు తెలియడం లేదు. అధికారులు తక్షణం బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

- చిత్తూరు కలెక్టరేట్,ఆంధ్రజ్యోతి

గుంతలు లేని రహదారులే ధ్యేయం



రోడ్డు రోలర్ నడుపుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని, పక్కన కలెక్టర్ వెంకటేశ్వర్

పాకాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గుంతలులేని రహదారులు అభివృద్ధి చేసి ప్రమాదాలు నివారించడమే ప్రభుత్వ ధ్యేయమని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎమ్మెల్యే పులివర్తి నాని తెలియజేశారు. 'మిషన్ పాత్ హోల్ ఫ్రీ ఏపీ' పేరిట చేపట్టిన రోడ్ల మరమ్మతు పనులకు శనివారం పాకాల మండలంలో శ్రీకారం చుట్టారు. ఈపాలగుట్టపల్లె పంచాయతీ శేషాపురం వద్ద భూమిపూజ చేసి రహదారుల మరమ్మతు పనులను చేపట్టారు. రూ.4.50 లక్షలతో 6 కిలోమీటర్ల మేర మరమ్మతు పనులు చేయనున్నట్లు తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గంలో మొదటి విడతలో 11 గుంతల రహిత రహదారుల కోసం 87.63 కిలోమీటర్ల మేర పనులను రూ.89.40 లక్షలతో చేపడుతామన్నారు. అనంతరం ఏనుగుల దాడుల పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని రైతులు కలెక్టర్‌ను కోరారు. శేషాపురంలో సెల్‌టవర్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. పరిహారం అందేలా చూస్తామని, సెల్‌టవర్ ఏర్పాటు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా 66 రహదారుల మరమ్మతులకు రూ.12.34 కోట్లు మంజూరయ్యాయన్నారు. మరో 55 రోడ్ల మరమ్మతు పనులకు 95 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎస్ఈ మధుసూదన్ రావ్, డీఈ శ్రీనివాసులు, జడ్పీటీసీ పద్మజరెడ్డి, ఎంపీడీవో శశిరేఖ, తహసీల్దార్ నిత్యానందబాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నానీచే పలు ప్రారంభోత్సవాలు

పాకాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం ఎమ్మెల్యే పులివర్తి నాని పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, భూమిపూజ చేశారు. పాకాల పంచాయతీ బొమ్మయ్యకుంట వద్ద ఏర్పాటు చేసిన జిమ్‌ను ప్రారంభించారు. సీఐ కార్యాలయం, భారతంమిట్ట, పార్కువీధి, పరిసర ప్రాంతాలలో రూ.1.17 కోట్లతో నిర్మించనున్న మురుగు కాలువల నిర్మాణానికి, సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. భారతంమిట్ట 7 వీధిలో నిర్మించనున్న మురుగు కాలువకు ప్రారంభోత్సవం చేశారు. బజారువీధిలోని చౌక దుకాణంలో సరుకులను అందజేశారు.

104 వాహనాలపై దాడి

- అద్దాలను పగులగొట్టిన గుర్తు తెలియని వ్యక్తులు
- పాత ప్రసూతి ఆస్పత్రి ఆవరణలో ఘటన



గుర్తు తెలియని వ్యక్తుల దాడిలో పగిలిన 104 వాహన అద్దాలు

తిరుపతి(వైద్యం), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పాత ప్రసూతి ఆస్పత్రి ఆవరణలోని పార్కింగ్ ప్రదేశంలో నిలిపివున్న నాలుగు 104 వాహనాలపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి దాటాక చోటుచేసుకుంది. తిరుపతి పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించే నాలుగు 104 వాహనాలను విధుల అనంతరం సిబ్బంది ఆస్పత్రి ఆవరణలోని ఆరోగ్యశ్రీ కార్యాలయం ముందు పార్కింగ్ చేశారు. శనివారం తెల్లవారుజామున వచ్చి చూడగా నాలుగు వాహనాల అద్దాలు పగిలి ఉండడం గుర్తించారు. వెంటనే విషయాన్ని వాహనాల పర్యవేక్షకుడు శేషసాయిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. వెస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేయగా నిత్యం ఆస్పత్రి ఆవరణలో సంచరించే మతిస్థిమితం లేని వ్యక్తి పగులగొట్టినట్లు నిర్ధారించారు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించారు. రాత్రిళ్లు పోలీసుల గస్తీ సక్రమంగా లేకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

అభివృద్ధికి అందరూ సహకరించండి : నాని

పాకాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులు చేయడానికి పార్టీలకతీతంగా అందరూ సహకరించాలని ఎమ్మెల్యే పులివర్తి నాని కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీపీ లోకనాథం అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ తాగునీరు, మెరుగైన వైద్య సేవలు, పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. గత ప్రభుత్వ పాలనలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కృషిచేయాలన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు సత్వరమే ఏర్పాటు చేయాలన్నారు. సమావేశానికి హాజరుకాని అధికారులకు మెమో జారీ చేసి వారి జాబితాను కలెక్టర్‌కు పంపాలని ఎంపీడీవోను ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ పద్మజరెడ్డి, ఎంపీడీవో శశిరేఖ, తహసీల్దార్ నిత్యానంద బాబు, పంచాయతీ రాజ్ డీఈ మురళి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు జిల్లా విద్యార్థులు



తిరుచానూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలు జరిగాయి. అండర్-14, అండర్ -17 విభాగంలో ఈ పోటీలు జరిగాయి, అండర్-14 విభాగంలో 11మంది బాలురు, అండర్-17లో బాలురు 13మంది, బాలికలు 15మంది రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు హెచ్‌ఎం మురళి వెల్లడించారు. మచిలీపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు వీరు అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచిన వారికి పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ పోటీలకు రెఫరీగా తిరుచానూరు జడ్పీ ఉన్నత పాఠశాల పీడీ సురేంద్రబాబు, పళని వ్యవహరించారు. విద్యార్థులను అధ్యాపకులు ప్రభాకర్, పూర్ణచంద్ర, వెంకటముని తదితరులు అభినందించారు.

ఆర్టీసీ ఈడీ చెంగల్‌రెడ్డికి సన్మానం



చెంగల్‌రెడ్డి సన్మానిస్తున్న ఈయూ రాష్ట్ర, జిల్లా కార్యవర్గాల ప్రతినిధులు

తిరుపతి(ఆర్టీసీ), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.చెంగల్‌రెడ్డిని శనివారం ఘనంగా సన్మానించారు. ఆయన సుదీర్ఘకాలంగా ఉమ్మడి జిల్లాలో రీజనల్ మేనేజర్‌గా, విభజన తరువాత తిరుపతిలో డీపీటీవోగా పనిచేశారు. పదోన్నతిపై ఇటీవల విజయవాడ ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. గతవారం ఈడీగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర, జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో అభినందన సమావేశం నిర్వహించారు. ఆయన సేవలను కొనియాడారు. చెంగల్‌రెడ్డి మాట్లాడుతూ కలసికట్టు పనిచేసి ఆర్టీసీ మంచిపేరు తీసుకురావాలని కోరారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని డిపోల ఈయూ సంఘాలు ఆయన్ను ఘనంగా సత్కరించాయి. ముఖ్య అతిథిగా ఇన్‌చార్జ్ డీపీటీవో జగదీష్ హాజరవగా డిప్యూటీ సీటీఎం భాస్కర్, ఈయూ నాయకులు అవుల ప్రభాకర్, తాండాయం సత్యనారాయణ, ఈఆర్ కుమార్, మురుగమ్మ, మస్తాన్, విజయ్‌కుమార్, మధు, పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

వకుళమాత సేవలో భానుప్రకాష్ రెడ్డి



తిరుపతి విద్య, నవంబరు 2 (ఆంధ్ర జ్యోతి): టీటీడీ పాలక మండలి సభ్యులుగా నియమితులైన బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి శనివారం పేరూరులోని వకుళమాత అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. దర్శనానంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అమ్మవారి ఆలయాన్ని బాసర తరహాలో అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తానన్నారు. పుష్కరిణిలో నదుల వారీగా విగ్రహాలు ఏర్పాటు చేయిస్తామన్నారు. పేరూరు గ్రామస్థులకు ఆలయ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం కల్పించి తద్వారా వారికి ఉపాధి కలిగేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. సనాతన ధర్మ పరిరక్షణట్రస్ట్ అధ్యక్షులు అరుణ్ మాకిరెడ్డి పాల్గొన్నారు.

శ్రీచైతన్యలో కంటివైద్య శిబిరం



తిరుపతి(విద్య), నవంబరు2(ఆంధ్రజ్యోతి): తిరుమల బైపాస్‌రోడ్డులోని శ్రీచైతన్య స్కూల్లో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా వాసన్ ఐకేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో కంటివైద్య శిబిరం నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులు, టీచర్లు, సిబ్బందికి కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఏజీఎం సురేష్, ప్రిన్సిపాల్ మేగోమీ, అకడమిక్ కో-ఆర్డినేటర్ బాలాజి, వైస్‌ప్రిన్సిపాల్ బాలరాజు, అకడమిక్ డీన్ శివకుమార్, సి.ఇన్‌చార్జి రహంతుల్లా, ఆస్పత్రి డీజీఎం బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు షిఫ్ట్ ఆపరేటర్ మృతి



గోపీకృష్ణ మృతదేహం

గూడూరు అర్బన్, నవంబరు 2 (ఆంధ్ర జ్యోతి): స్థానిక చవటపాళెం సమీపంలోని ఓ ప్రైవేటు కర్మాగారంలో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న యువకుడు ప్రమాదవశాత్తు మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. రెండోపట్టణ పోలీసుల వివరాల మేరకు.. నెల్లూరు జిల్లా కోవూరు గ్రామానికి చెందిన గోపీకృష్ణ(35) చవటపాళెం సమీ పంలోని ఓ కర్మాగారంలోని కోరిషాపులో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు మిషన్ పరికరాలు గోపీకృష్ణ తలకు తగలడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైదులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా నగర సంకీర్తన



తిరుపతి అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక భజనమండలి కళాకారుల ఆధ్వర్యంలో శనివారం ఉదయం గోవిందరాజస్వామి ఆలయ మాడవీధుల్లో నగర సంకీర్తన ఘనంగా నిర్వహించారు. కళాకారులతో పాటు కొంతమంది భక్తులు కూడా తిరునామాలు ధరించి సంప్రదాయ వస్త్రధారణతో మంగళవాయిద్యాల నడుమ గోవిందనామాలు ఆలపిస్తూ తిరువీధుల ప్రదక్షిణ చేపట్టారు. అనంతరం ఆలయం ముందు భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూర్యప్రకాష్, గుండాల గోపీనాథ్‌రెడ్డి, సుబ్బారెడ్డి, వాసుదేవరెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, మునిరత్నం ఆచారి, వెంకటాద్రి, విజయభాస్కర్‌రెడ్డి, కీర్తి, వెంకయ్య, పొన్నాల జేజిరెడ్డి పాల్గొన్నారు.

ఈతకొలను శుభ్రత పనులు ప్రారంభం



తిరుపతి(క్రీడలు), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాస క్రీడా సముదాయంలోని ఈతకొలను శుభ్రత పనులు శనివారం ప్రారంభమయ్యాయి. శుక్రవారం శాప్ ఛైర్మన్ రవినాయుడు సముదాయాన్ని సందర్శించి నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఆయన ఆదేశాలతో స్పందించిన జిల్లా క్రీడాధికారి సయ్యద్‌సాహేబ్ ఇద్దరి కూలీలను ఏర్పాటు చేశారు. స్విమ్మింగ్‌ఫూల్ అడుగు భాగాన పేరుకుపోయిన పాచి తొలగించే పనులు ముమ్మరం చేశారు. అవసరమైన కెమికల్స్‌ను వినియోగించి పూర్తిస్థాయిలో తొలగిస్తున్నారు. మిగిలిన పనులు, మరమ్మతులు త్వరలో ప్రారంభించనట్లు అధికారులు తెలిపారు.

హాస్టల్ విద్యార్థులకు అన్నదానం

తిరుపతి (జీవకోన), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జీవకోన ప్రాంతంలో రియల్స్ సంస్థ ఆధ్వర్యంలో నడుపుతున్న నేతాజీ సుభాష్ చంద్రబోస్ బాలికల హాస్టల్ విద్యార్థినులకు మహ్మద్, అహ్మద్ జన్మదినాన్ని పురస్కరించుకుని వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పుస్తకాలు, పెన్నులు శనివారం పంపిణీ చేశారు. అన్నదానం చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచులయ్య, ఏఐటీయూసీ నాయకులు అల్లాబక్షు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, సంస్థ అధినేత కృష్ణమూర్తి, వార్డెన్ హేమావతి తదితరులు పాల్గొన్నారు.



శ్రమదానం

పెనుమూరు నుంచి చిత్తూరు వెళ్లే మార్గంలో పెద్దరాజుపల్లి గ్రామం వద్ద రోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడి తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. కనీసం గుంతలకు మట్టి తోలి మరమ్మతులు చేయించాలని పలువురు కోరినా ఫలితం లేకపోయింది.దీంతో పెద్దరాజుపల్లి యువకులు శనివారం రోడ్డుపై ఉన్న గుంతల్లో మట్టి, ఇటుకలు చల్లి గుంతలను పూడ్చారు.

- పెనుమూరు, ఆంధ్రజ్యోతి

ద్రావిడ వర్సిటీలో విచారణ కమిటీ

- అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామక తీరుపై సమాచార సేకరణ



గుడుపల్లె, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ విశ్వవిద్యాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకంపై శనివారం కమిటీ విచారణ చేపట్టింది. గత ప్రభుత్వ హయాంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కొన్ని నెలలుగా జీతాలు అందకపోవడంతో వారు నిరసన వ్యక్తం చేశారు. జీతాలు ఇస్తామని చెప్పిన వైసీపీ నాయకులు జీతాలు ఇప్పించలేకపోయారు. దీంతో ఉద్యోగులు రోజూ పరిపాలనా భవనం ఎదుట నిరసన కొనసాగించారు. ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు తమ ప్రభుత్వం ఏర్పడిన తరువాత జీతాలు అందజేస్తామని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం చంద్రబాబు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు పెండింగ్ జీతాలను మంజూరు చేశారు. అయితే అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకంపై వాస్తవ పరిస్థితులు తెలుసుకొనేందుకు ఛైర్మన్‌గా వీసీ ఆచార్య దొరస్వామి, సభ్యులుగా ఉర్దూ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య షావలీ ఖాన్, ఎస్వీయూ మాజీ డిప్యూటీ రిజిస్ట్రార్ వరదరాజులను విచారణ కమిటీగా రాష్ట్రప్రభుత్వం నియమించింది. శనివారం కమిటీ సభ్యులు ద్రావిడ విశ్వవిద్యాలయానికి చేరుకుని వీసీ దొరస్వామి, రిజిస్ట్రార్ కిరణ్‌కుమార్‌లతో సమావేశమయ్యారు. అనంతరం కమిటీ హాలుకు చేరుకొని అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకంపై అధికారుల ద్వారా ఫైళ్లు తెప్పించుకొని పరిశీలించారు. రాత్రి వరకు కమిటీ సభ్యులు వారికి కావలసిన సమాచారాన్ని సేకరించారు. కమిటీ రూపొందించిన నివేదికను ప్రభుత్వానికి అందించనుందని రిజిస్ట్రార్ తెలిపారు.









డివైడర్లకు స్మార్ట్ కలర్స్

తిరుపతి- ఆంధ్రజ్యోతి: తిరుపతి నగర పరిధిలోని డివైడర్లు సరికొత్త రంగులు అద్దుకుంటున్నాయి. తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య చొరవతో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) ఉచితంగా రంగులు వేసేందుకు ముందుకు వచ్చింది. సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) దాదాపు రూ.50 లక్షల నిధులను డివైడర్లకు రంగులు, మురికివాడల్లోని మున్సిపల్ పాఠశాలలకు ఐఓసీఎల్ పెయింటింగ్ వేస్తోంది. వారం రోజులుగా నగరంలోని డివైడర్లకు కళాకారులు రంగులు వేస్తున్నారు. కలర్‌ఫుల్ డివైడర్ల మధ్య పక్కన వెళ్తున్న ప్రయాణీకులకు సరికొత్త అనుభూతి కల్గుతోంది. మరో ఆయిల్ కంపెనీతో కూడా మాట్లాడి మిగిలిన డివైడర్లను శోభాయమానంగా తీర్చదిద్దనున్నట్లు కమిషనర్ మౌర్య 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి చెప్పారు.

భవన నిర్మాణాలను త్వరగా పూర్తి చేయండి

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి ● టీటీడీ ఈవో శ్యామలరావు


రోగుల సహాయకులతో మాట్లాడుతున్న శ్యామల రావు

తిరుపతి(వైద్యం), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్విమ్స్ ఆవరణలో నిర్మాణంలో ఉన్న శ్రీబాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ, సెంట్రల్ డ్రగ్ స్టోర్ వంటి భవనాలతోపాటు ఇతర భవనాలను త్వరగా పూర్తి చేసి రోగులకు ఉపయోగపడే విధంగా అందుబాటులోకి తీసుకురావాలని టీటీడీ ఈవో శ్యామలరావు స్విమ్స్ అధికారులకు ఆదేశించారు. స్విమ్స్ ఆస్పత్రిని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని పలు వార్డులను పరిశీలించారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్యసేవలు, సదుపాయాలు, ఆరోగ్యశ్రీ సేవల గురించి రోగులను, వారి సహాయకులను అడిగి తెలుసుకున్నారు. వైద్యసేవలపై రోగులు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని స్విమ్స్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ డైరెక్టరు ఆర్వీకుమార్, సీఈ సత్యనారాయణ, ఎస్ఈ మనోహరం, ఎంఎస్ రామ్, ఆర్ఎంవో కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీలర్ల సమస్యలు పరిష్కరించండి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న తిరుపతి డీలర్స్ అసోసియేషన్ నాయకులు

తిరుపతి(సెంట్రల్)నవంబరు2(ఆంధ్రజ్యోతి): చౌకదుకాణాల డీలర్ల సమస్యలను పరిష్కరించాలని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు తిరుపతి జిల్లా చౌకదుకాణాల డీలర్ల సంఘం అధ్యక్షులు సివి వెంకటేష్ రెడ్డి, తిరుపతి టౌన్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. తిరుపతి పర్యటనలో భాగంగా సోమవారం మంత్రి స్థానిక చెన్నారెడ్డి కాలనీలో దీపం-2 పథకంలో భాగంగా అర్హులకు గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మంత్రిని సత్కరించి, వినతిపత్రం అందజేశారు. డీలర్లకు కమీషన్ పెంచాలని కోరారు. షాపుల విభజన, రేషనలైజేషన్ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

కందిపప్పు ఇప్పించండి

తిరుపతిలో కొంత మంది డీలర్లు కార్డుదారులకు కందిపప్పు ఇవ్వకుండా నల్ల బజారుకు తరలించి సొమ్ము చేసుకొంటున్నారని ప్రజలు ఆరోపించారు. పంపిణీ ప్రారంభించిన రెండవ రోజుకే కొన్నిషాపుల్లో కందిపప్పు ఇవ్వలేదని కార్డుదారులు వాపోయారు. బియ్యం పంపిణీ సమయంలోనే కందిపప్పు తీసుకున్నట్లు డీలర్లు నమోదు చేస్తున్నారని కార్డుదారులు తెలిపారు.

'వార్త లేఖ' ఆవిష్కరణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీలో బోధన, పరిశోధన వంటి కార్యక్రమాల గురించి అందరికీ తెలియజేసేందుకు వార్త లేఖ పేరుతో మాసపత్రికను ఏర్పాటు చేశారు. ఈ పత్రికను వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ ఉమ తదితరులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ ఉమ మాట్లాడుతూ.. వార్త పత్రికల్లోనూ యూనివర్సిటీకి సంబంధించి ప్రచురితమయ్యే వార్తలపై విశ్లేషణాత్మక వ్యాసాలను ఇందులో చేరుస్తామనారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ గీతావాణి, సెంట్రల్ నెట్ వర్కింగ్ ఫ్రేమ్ వర్క్ (సీఎన్ఎఫ్) డైరెక్టర్ ప్రొఫెసర్ నీలిమ, అసిస్టెంట్ డైరెక్టర్ సుమన, తదితరులు పాల్గొన్నారు.



వార్త లేఖను విడుదల చేస్తున్న ఇన్‌చార్జి వీసీ ఉమ తదితరులు

తిరుపతి

మద్యం స్వాధీనం... ఒకరి అరెస్టు


నిందితుడితో పోలీసులు

తిరుపతి రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న ఒకరిని పోలీసులు అరెస్టు చేశాడు. అతడి నుంచి 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి రూరల్ ఎక్సైజ్ సీఐ నరసానాయుడు కథనం మేరకు..తిరుపతి ఎమ్మార్ పల్లి ఎస్కే నగర్‌కు చెందిన సిద్ధవటం వెంకటరమణ (53) తుమ్మలగుంటకు వెళ్లే మార్గంలో అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో ఎక్సైజ్ సిబ్బంది తనిఖీ చేశారు. అతడి నుంచి 20 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. మద్యం విలువ రూ.2,600 ఉంటుంది. కేసు నమోదు చేశారు.

తిరుపతి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల్లో వేగం



తిరుపతి(సెంట్రల్)నవంబరు2(ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే స్టేషన్ పునర్నిర్మాణ అభివృద్ధి పనులు (స్టేషన్ రీ డెవలప్ మెంట్ వర్క్స్) వేగం పుంజుకున్నాయి. తిరుపతి రైలే స్టేషన్ మోడల్ స్టేషన్‌గా అభివృద్ధి చేసేందుకు రీడెవలప్‌మెంట్ అభివృద్ధి పనులు చేపట్టారు. రూ.299 కోట్లతో 2022 ఫిబ్రవరి 8న పనులు ప్రారంభించారు. దక్షిణం వైపు నూతన భవననిర్మాణ పనులు, స్టేషన్‌కు దక్షిణం, ఉత్తరం వైపు నిర్మించే నూతన భవనాలను కలిపే రెండు ఎయిర్ కాన్ కోర్స్‌ల పనులు దాదాపు 80 శాతం పూర్తి కావచ్చాయి. ఈ రెండు పనులను వచ్చే ఏడాది ఏప్రిల్ 15లోపు పూర్తి చేసేలా పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఉత్తరం వైపు నూతన భవన నిర్మాణాలు అదనపు సమయంలో పూర్తిచేసే అవకాశం వుంది. ఇదిలా ఉండగా భారత రైల్వేలో జరుగుతున్న రైల్వే అభివృద్ధి పనులను పరిశీలించడానికి పార్లమెంట్ కమిటీని నియమించింది. ఈ కమిటీ సోమవారం తిరుపతి స్టేషన్‌లో జరుగుతున్న పనులను పరిశీలించనుంది. ఇందులో భాగంగా గుంతకల్లు డివిజన్ అధికారులు ఆదివారం తిరుపతికి చేరుకుని ఏర్పాట్లను పరిశీలించనున్నారు.

మంగళం వీధుల్లో చెత్త తొలగింపు



తిరుపతి అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తిరుపతికి శివారు ప్రాంతమైన మంగళం క్వార్టర్స్ వీధుల్లో చెత్తను పూర్తిగా తొలగించారు. శనివారం ఆంధ్రజ్యోతిలో 'మంగళంలో అధ్వానంగా పారిశుద్ధ్యం' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన మంగళం-2 సచివాలయ కార్యదర్శి లావణ్య వెంటనే చర్యలు చేపట్టారు. ట్రాక్టర్, పారిశుద్ధ్య కార్మికులను వెంటబెట్టుకొని ప్రతి వీధిలోనూ నిల్వ ఉన్న చెత్తకుప్పలను పూర్తిగా తొలగించి శుభ్రం చేశారు. దారి అంచుల్లో ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు. ప్రజలు బహిరంగ ప్రదేశాలలో చెత్త వేయకూడదని బోర్డులు నాటారు. ఒకవేళ వేస్తే జరిమాన విధిస్తామని హెచ్చరించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ర్యాగింగ్ రహిత క్యాంపస్‌గా వెటర్నరీకి ప్రత్యేక గుర్తింపు

● ఫ్రెషర్స్‌డేలో డీన్ వీరబ్రహ్మయ్య


విద్యార్థులతో వీరబ్రహ్మయ్య, ఏడీ జగపతిరామయ్య తదితరులు

తిరుపతిరూరల్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ కళాశాలకు ర్యాగింగ్ రహిత క్యాంపస్‌గా ప్రత్యేక గుర్తింపు ఉందని, ఈ విద్యా సంవత్సరంలో కొత్తగా ప్రవేశాలు పొందిన జూనియర్ విద్యార్థులపట్ల సీనియర్లు స్నేహపూర్వకంగా మెలిగి వారికి మార్గదర్శకంగా వ్యవహరించాలని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ కె.వీరబ్రహ్మయ్య తెలిపారు. కళాశాల ఆడిటోరియంలో బీవీఎస్సీ అండ్ ఏహెచ్ డిగ్రీ కోర్సులో ప్రవేశాలు సాధించిన విద్యార్థులకు శనివారం ఫ్రెషర్స్‌డే ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ చదివిన పలువురు పూర్వ విద్యార్థులు దేశ, విదేశాల్లో ఉన్నతస్థాయిలో ఉన్నారని, వారిని ఆదర్శంగా తీసుకుని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ పి.జగపతి రామయ్య మాట్లాడుతూ అధునాతన బోధన, వసతి సదుపాయాలు ఉన్నాయని వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. డెయిరీవిభాగ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ నాగేశ్వర రావు, ఓఎస్‌పే డాక్టర్ ఆర్.వేణు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ సర్కిల్ కేంద్రాలకు వెళ్లడానికి సిద్ధంకండి: ఎస్ఈ


ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న సురేంద్ర నాయుడు

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా కేంద్రంలో ఉన్న నూతన విద్యుత్ సర్కిల్ కేంద్రంలో కార్యనిర్వాహక విధులు నిర్వహించడానికి అన్ని విభాగాల ఉద్యోగులు సిద్ధంకావాలని ఉమ్మడి తిరుపతి సర్కిల్ ఎస్ఈ పి.సురేంద్రనాయుడు కోరారు. రాష్ట్రంలో జిల్లాల విభజన జరిగిన అనంతరం విద్యుత్ సర్కిల్స్ విభజన జరగలేదు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం చొరవతో అధికారులు సర్కిల్ ఏర్పాటు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. విద్యుత్ సర్కిల్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆ కార్యాలయాల్లో కార్యనిర్వాహక విధులు నిర్వహించడానికి శనివారం ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సదస్సులో ఎస్ఈ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలమేరకు సర్కిల్ కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రభుత్వం, సంస్థ నిబంధనల మేరకు ఉమ్మడి సర్కిల్ నుంచి నూతన సర్కిల్‌కు బదిలీలు ఉంటాయన్నారు. తిరుపతి కార్యాలయం నుంచి 50 శాతం మందికి బదిలీలు ఉంటాయన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సైతం బదిలీలు ఉంటాయని చెప్పారు. ప్రతిఒక్కరూ అంకితభావంతో విధులు నిర్వహించి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్ఏవో శ్రీనివాసులు, సర్కిల్ టెక్నికల్ ఈఈ ఎస్‌సి వాసవీలత, సీవో నాగరాజు, డీవై ఈఈ పి.ప్రసన్న కుమారి, సర్కిల్ సిబ్బంది పాల్గొన్నారు.

1న అంతర్‌జిల్లాల బాడీబిల్డింగ్ పోటీలు


కరపత్రాలు విడుదల చేస్తున్న నిర్వాహకులు

తిరుపతి(క్రీడలు), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 1న అంతర్‌జిల్లాల బాడీబిల్డింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు గోల్డ్ ఇన్ ఇండియా బాడీబిల్డింగ్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ వై.ప్రవీణ్ తెలిపారు. శనివారం ఈ పోటీలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి, చిత్తూరు, కడప జిల్లాల క్రీడాకారులు అర్హులని, పోటీలను తిరుపతి వేదిక నిర్వహిస్తామని పేర్కొన్నారు. బాడీబిల్డింగ్‌తో పాటు మెన్, ఉమెన్‌ల మోడలింగ్ పోటీలు ఉంటాయన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు నగదు బహుమతితోపాటు, మెడల్స్ ప్రదానం చేస్తామన్నారు. ఆసక్తిగల బాడీబిల్డర్స్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 9505873777, 7013274433 నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్యాట్రన్ ఎ.ఈశ్వర్ ప్రకాష్, శివప్రసాద్, హరి, బద్రి, అరుణ్, కుమార్, హరి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నాదెండ్లకు టీడీపీ నేతల సన్మానం



తిరుపతి/తిరుపతి అర్బన్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): తిరుపతి పర్యటనకు విచ్చేసిన పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను టీడీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఉదయ్ ఇంటర్నేషన్ అధినేత గిరినాయుడు నివాసానికి వచ్చిన మంత్రిని టీడీపీ నేతలు సుగుణమ్మ, నరసింహయాదవ్, కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, ఊకా విజయకుమార్, దంపూరి భాస్కర్ యాదవ్, ఊట్ల సురేంద్రనాయుడు, పాటకం వెంకటేష్ శాలువాతో సత్కరించి శ్రీవారి జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఆయన రాత్రి తిరుమలకు వెళ్లారు. ఆదివారం శ్రీవారిని దర్శించుకోనున్నారు. అంతకుముందు తిరుపతి విమానాశ్రయంలో జనసేన తిరుపతి ఇన్‌చార్జ్ కిరణ్‌రాయల్, నగర అధ్యక్షుడు రాజారెడ్డి, జనసేన సీనియర్ నాయకుడు, రాష్ట్ర ఉద్యోగ సంఘాల మాజీ నేత నరసింహులు నాయుడు తదితరులు మంత్రికి ఘనస్వాగతం పలికారు.

రైతులకు సబ్సిడీపై బిందు, తుంపర్ల సేద్యం పరికరాలు

తిరుపతి(ఎం.ఆర్.పల్లి)నవంబరు2(ఆంధ్రజ్యోతి): బిందు, తుంపర్ల సేద్యం పరికరాలను సబ్సిడీపై అంద జేస్తున్నట్లు తిరుపతి జిల్లా సూక్ష్మ సేద్య అధికారి సతీష్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఐదు ఎకరాల లోపు ఉన్న సన్న, చిన్నకారు రైతులకు 90 శాతంతో ఒక్కో రైతుకు గరిష్ఠంగా 2.18 లక్షల వరకు రాయితీ ఉంటుందని, ఐదు నుంచి 10 ఎకరాలు కలిగిన రైతులకు 70 శాతంతో ఒక్కో రైతుకు గరిష్ఠంగా 3.46 లక్షల వరకు రాయితీ లభిస్తుందని వివరించారు. స్ప్రింకర్లపై సన్న, చిన్నకారు రైతులకు 55శాతం, ఎకరం నుంచి 10 ఎకరాలు కలిగిన రైతులకు 45 శాతం రాయితీ ఉంటుందని వివరించారు.

నేడు భూమన ప్రమాణస్వీకారం

తిరుపతిరూరల్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): వైసీపీ జిల్లా నూతన అధ్యక్షుడిగా భూమన కరుణాకరరెడ్డి ఆదివారం ఉదయం 10గంటలకు బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమం కోసం తిరుపతిరూరల్ మండలంలో 150జాతీయ రహదారిని ఆనుకుని సదరన్‌స్పైస్ హోటల్‌కి సమీపంలో బహిరంగసభకు ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా మాజీ ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల, అక్టోబరు2(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఎమ్మెల్యే ఆదిమూలం, ఎంపీ గురుమూర్తి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

తిరుమలలో బాలకార్మికుల గుర్తింపు

తిరుమల, నవంబరు2(ఆంధ్రజ్యోతి): పాన్ ఇండియా బాలకార్మిక నిర్మూలన కార్యక్రమంలో భాగంగా కార్మిక శాఖ అధికారులు, ప్రగతి స్వచ్ఛంద సేవా సంస్థ, ఐసీడీఎస్, సమగ్ర శిక్ష అభియాన్ సభ్యులు పోలీసులతో కలిసి తిరుమలలో తనిఖీలు నిర్వహించారు. బాల కార్మికులు ఎవరైనా ఉన్నారా అనే అంశంపై షాపింగ్ కాంప్లెక్స్, దుకాణ సముదాయాలు, హోటళ్లలో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో మొత్తం ఏడుగురు బాల కార్మికులను గుర్తించారు. ఈ తనిఖీల్లో కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ చిన్నలాలెప్ప, ఏఎల్వోలు రంగనాథ్, శ్రీమన్నారాయణ, ప్రవీణ్‌కుమార్, ప్రగతి సంస్థ జిల్లా ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ రాజారెడ్డి, తిరుమల ఏఎస్ఐ మధు, సీడీపీవో శివశంకర్, సమగ్ర శిక్ష అభియాన్ సభ్యురాలు వరలక్ష్మి పాల్గొన్నారు.

కపిలతీర్థం ఆలయ ఆవరణలో పొగాకు విక్రయాలు..!

తిరుపతి(నేరవిభాగం), నవంబర్ 2(ఆంధ్రజ్యోతి): కపిలతీర్థం ఆలయ ఆవరణలో పొగాకు విక్రయాలు సాగుతున్నాయి. దీనిపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శనివారం ఆలయ ఆవరణలోని ఒక టీటీడీ షాపులో గుట్కా సంబంధిత ప్యాకెట్లను, సిగరెట్లను విక్రయిస్తుండగా స్థానికులు గమనించి నిలదీశారు. అక్కడ విధులు నిర్వర్తించే వ్యక్తి ఏమీ తెలియనట్లు ఉండిపోయాడు. పవిత్రమైన ఆలయ ఆవరణలో పొగాకు విక్రయాలు సాగుతున్నా అధికారులకు తెలియకపోవడం గమనార్హం. కాగా ఆ షాపును నిర్వహించే వ్యక్తి పెద్దిరెడ్డి అనుచరుడిగా స్థానికులు చెప్పుకుంటున్నారు.

చిన్నారి హత్యపై ఎంపీ దిగ్భ్రాంతి

తిరుచానూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వడమాలపేట మండలం ఏఎంపురం ఎస్టీకాలనీ చిన్నారి హత్య తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నిందితుడు సుశాంత్‌ను కఠినంగా శిక్షించాలని ఆయన పోలీసుశాఖకు విజ్ఞప్తి చేశారు. బాధిత కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు.

దోమల నివారణకు డ్రోన్లతో మందుల పిచికారీ

తిరుపతి, నవంబరు2(ఆంధ్రజ్యోతి): మనుషులు వెళ్లలేని ప్రాంతాల్లో దోమల లార్వాలు వృద్ధి చెందకుండా, నియంత్రించడానికి డ్రోన్లతో మందులు పిచికారి చేస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య తెలిపారు. వినాయకసాగర్ వద్ద శనివారం డ్రోన్లతో పిచికారి చేసే రెండో విడత కార్యక్రమాన్ని కమిషనర్ పరిశీలించారు. ఈసందర్భంగా మౌర్య మాట్లాడుతూ నగరంలో దోమల నివారణకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నామన్నారు. నిల్వనీటిలోని దోమ లార్వాలను నాశనం చేసేందుకు ఆయిల్ బాల్స్ వేస్తున్నామని, ప్రతిరోజూ ఫాగింగ్ చేస్తున్నామన్నారు. దోమల వృద్ధి ఎక్కువగా ఉన్న 32 ప్రాంతాలతో పాటు మొత్తం 209 ఎకరాల్లో రోజుకు 20 ఎకరాల చొప్పున, 15 రోజులకోసారి పిచికారీ చేస్తున్నామన్నారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్‌రెడ్డి ఉన్నారు.

ఆదివారం ప్రత్యేకం

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి అలంకార ప్రియుడే కాదు, మంచి భోజన ప్రియుడు కూడా. ఈ తరం మాటల్లో చెప్పాలంటే మంచి ఫుడీ. కాకపోతే పిజ్జాలు, బర్గర్ల రకం కాదు. ఆరోగ్యకరమైన ఆహారం మాత్రమే స్వామి స్వీకరిస్తాడు. పోషక విలువలు మెండుగా ఉన్న ఆహారమే స్వామి నైవేద్యం. మనలాగే స్వామి కూడా రోజుకు మూడు పూటలు విభిన్నమైన ఆహారపదార్థాలు తీసుకుంటాడు. ఎప్పుడు పడితే అప్పుడు, ఏదిపడితే అది స్వామి స్వీకరించడు. ప్రాతఃకాలంలో, మధ్యాహ్న, రాత్రి సమయాల్లో స్వామికి నైవేద్యం సమర్పిస్తారు. ఆ నైవేద్యాల విశేషాలు.. ఈ ఆదివారం ప్రత్యేకం!

భోజన ప్రియుడు





ప్రత్యేక కథనం
ఆంధ్రజ్యోతి, తిరుమల

తిరుమల ప్రసాదం అనగానే లడ్డూ మాత్రమే గుర్తుకు వస్తుంది. నిజానికి 50 రకాల ప్రసాదాలను వెంకన్న స్వామికి నివేదిస్తారు. రోజూ సమర్పించేవి కొన్ని అయితే, వారానికో రోజు పెట్టేవి కొన్ని ఉంటాయి. ప్రత్యేక ఉత్సవాల రోజుల్లో సమర్పించే నైవేద్యాలు మరికొన్ని. మూలమూర్తికి సమర్పించేవి కొన్ని అయితే, మలయప్పస్వామికి నివేదించేవి మరికొన్ని ఉంటాయి. ప్రసాదాలను శ్రీవారి ఆలయంలోని పోటులోనే తయారు చేస్తారు. పోటులో ఈ వంటకాలను శ్రీనివాసుడి మాతృమూర్తి వకుళాదేవి పర్యవేక్షిస్తారని నమ్ముతారు. వీటిల్లో చాలా పరిమితమైన నైవేద్యాలు మాత్రమే భక్తులకు అందుతాయి. విక్రయించరు కాబట్టి వీటి గురించి చాలా మందికి తెలియదు.

సుప్రభాత సమయంలో: నవనీతం, గోక్షీరంతో తయారు చేసిన పదార్థాలను స్వామికి నివేదిస్తారు.

తోమాలసేవ తరువాత కొలువు ప్రసాదం: నల్ల నువ్వులు, బెల్లంతో చేసిన ఈ ప్రసాదాన్ని 'కొలువు పిండి ప్రసాదం' అంటారు. 'నువ్వుల చిమ్మిరి' అన్నమాట.

మొదటి గంట

ఉదయం 5.30 గంటలకు మీగడ, వెన్న, పెరుగుతో చేసే 'మాతృ దద్యోధనం' స్వామికి సమర్పిస్తారు.మాత్రన్నం (వెన్న, ఇంగువ, ఉప్పుతో చేసిన ప్రసాదం), శుద్ధన్నం, చక్కెర పొంగలి, ఉప్పుపొంగలి, పులిహోర, కదంబం, దద్యోధనం కూడా స్వామికి నివేదిస్తారు.

రెండవ గంట

పొద్దు బాగా పైకొచ్చిన తర్వాత 10 గంటలకు నాదూకం, లడ్డూ, దోశ, వడ, అప్పం నివేదిస్తారు. సేకరాబాత్ పెడతారు.

అష్టోత్తరశత నామార్చన: ఉదయం 9.45 గంటలకు శుద్ధన్నం, సీరా నివేదిస్తారు.

రాత్రి గంట

7.30 తర్వాత మరీచాన్నం(మలహోర), ఉడాన్నం (బెల్లం పొంగలి), కదంబం, శుద్ధన్నం, దద్యోధనం, పులిహోర, అమ్మవారి పాయసం(పలచగా వుండే చక్కెర పొంగలి), తోమాల దోసె, సీరాలను నివేదిస్తారు

రాత్రి విశ్రాంతి సమయంలో: పాయసాన్నం నివేదిస్తారు. పడుకోబోయే ముందు.. డ్రై ఫ్రూట్స్, పాలు, పండ్లు నివేదిస్తారు.



రోజూ పెట్టే ప్రసాదాలు చిత్రాన్నం, దద్యోధనం, క్షీరాన్నం, కదంబం, పాయసాన్నం.

వార నివేదనలు ● **ఆదివారం నాడు** బియ్యపు పిండి, బెల్లం, నెయ్యితో ప్రత్యేకంగా తయారు చేసే అమృత కలశం ప్రసాదంగా పెడతారు. పానకం సమర్పిస్తారు. ● **మంగళవారం** అష్టదళం తర్వాత సీరా, వడపప్పు, పానకం సమర్పిస్తారు.● **గురువారం** తిరుప్పావడలో పులిహోర, పిట్టు, జిలేబి, మురుకులను నైవేద్యంగా పెడతారు. రెండు గంగాళాల పాయసాన్ని కూడా నివేదిస్తారు. పానకం సమర్పిస్తారు. ● **శుక్రవారం** అభిషేకం తర్వాత బెల్లం పాయసం, పోలీలు, పానకం నివేదిస్తారు.

మాత్రాన్నం
రోజూ మొదటిగంటకు రెండు గంగాళాల మాత్రాన్నం నైవేద్యంగా సమర్పిస్తారు.

మలహోర: రోజూ రాత్రి గంటకు రెండు గంగాళాల మలహోరను నివేదిస్తారు.



వరలక్ష్మీవ్రతం రోజున: శనగపిండితో చేసిన సుగీలను తయారు చేసి స్వామికి నివేదిస్తారు. పెసరపప్పుతో చేసిన సుగీలను జీయంగార్ల మఠానికి పంపుతారు.

గుగ్గిళ్లు: రోహిణి నక్షత్రం రోజున, ఏకాదశి, వైకుంఠ ఏకాదశి పర్వదినాల్లో పప్పు శనగ గుగ్గిళ్ల స్వామికి నైవేద్యంగా పెడతారు. ధనుర్మాసంలోనూ రోజూ మొదటి గంటలో గుగ్గిళ్ల నివేదిస్తారు.





తోమాలదోశ: రాత్రి నైవేద్యంగా ప్రతి రోజు 51 దోశలను సమర్పిస్తారు.



మేవా: ఏటా మూడురోజుల పాటు జరిగే వసంతోత్సవాల సందర్భంగా వివిధ రకాల పండ్ల రసాలతో ఈ ప్రసాదాన్ని తయారు చేసి సమర్పిస్తారు.

గరుడసేవ ప్రత్యేకం మనోహరం: గరుడసేవ రోజు పెద్ద మనోహరం, రథోత్సవం రోజున చిన్న మనోహరం ప్రసాదంగా స్వామికి పెడతారు.



సేకరాబాత్ : ప్రసాదాన్ని రెండవ గంటలో ఓ గంగాళాన్ని నివేదిస్తారు.



పోలీ: శుక్రవారం ఉదయం తొలి గంటకు 102 పోలీలను సమర్పిస్తారు.



బెల్లం పొంగలి: గురువారం మినహా రోజూ నాలుగు గంగాళాలు సమర్పిస్తారు.

పులిహోర: రోజూ నాలుగు గంగాళాలు. గురువారం మాత్రం తిరుప్పావడ సందర్భంగా అదనంగా 450 కేజీలు తయారు చేసి సమర్పిస్తారు.



దధ్యోదనం: రోజూ ఎనిమిది గంగాళాలు చేస్తారు. గురువారం మాత్రం మూడు గంగాళాలు నివేదిస్తారు.





జిలేబి: గురువారం రోజున జరిగే తిరుప్పావడ సేవ సందర్భంగా జిలేబీ, మురుకులను తయారు చేస్తారు. ఏడు పడులు అంటే దాదాపు 350 జిలేబీలను తయారుచేసి స్వామికి నివేదిస్తారు.

అమృతకలశం: ఆదివారం మాత్రమే ఈ ప్రసాదాన్ని ప్రత్యేకంగా ఒక గంగాళానికి తయారుచేసి సమర్పిస్తారు.



గర్భాలయంలోకి వెళ్లే ప్రసాదాలు: లడ్డూ, వడ, సుద్దాన్నం, మాతృ ప్రసాదం. రోజూ క్యూలైన్లలో దర్శనానికి వచ్చే భక్తులకు పులిహోర 60 గంగాళాలు, పొంగలి 60 గంగాళాలు అదనంగా తయారు చేసి వితరణ చేస్తారు.

కదంబం: శని, ఆదివారాల్లో 16, మిగిలిన రోజుల్లో ఎనిమిది గంగాళాలు సమర్పిస్తారు.




మిరియాల పొంగలి: ప్రతిరోజు నాలుగు గంగాళాలు సమర్పిస్తారు.



స్వామికి సద్దెన్నం: మాతృప్రసాదం అంటే మనం తినే సద్దెన్నం వంటిదే. స్వామివారు భూలోకానికి వచ్చినప్పుడు వకుళమాత ఈ ప్రసాదం పెట్టేదట. రాత్రి మిగిలిన అన్నంలో పాలు, చేమిరి వేసి పెట్టి.. ఉదయాన్నే కుమారుడికి పెట్టేదంట. అందుకే దీనికి మాతృప్రసాదం అని పేరు వచ్చిందంటారు.







హత్యకేసులో నిందితుల అరెస్టు

చిల్లకూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడివేడు అరుంధతివాడ వెంకటేష్ హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ రమణకుమార్ తెలిపారు. శనివారం చిల్లకూరు పోలీస్‌స్టేషన్‌లో వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. కడివేడు అరుంధతివాడకు చెందిన వెంకటేష్, పొట్టేళ్ల సుబ్రహ్మణ్యం మధ్య పాత గొడవలున్నాయి. ఇటీవల స్వల్ప వివాదం రాగా సుబ్రహ్మణ్యంతో పాటు అతని స్నేహితులైన సాయికుమార్, సునీల్‌ను వెంకటేష్ బెదిరించాడు. దీంతో వెంకటేష్‌ను చంపాలని వారు పథకం పన్నారు. అక్టోబర్ 31వ తేదీన వెంకటేష్ మరో ఇద్దరితో కలిసి గ్రామానికి చెందిన భాస్కర్ ఇంట్లో మద్యం తాగుతున్నాడు. ఈ క్రమంలో సునీల్ వెంకటేష్ కళ్లలో కారం పొడి చల్లగా సుబ్రహ్మణ్యం, సాయికుమార్ ఐరన్ రాడ్డు, సుత్తితో దాడి చేశారు. వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటేష్ తండ్రి గోపాలయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కోట క్రాస్ రోడ్డు సమీపంలో సుబ్రహ్మణ్యం, సాయికుమార్, సునీల్‌లను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో సీఐ కిషోర్‌బాబు, ఎస్‌ఐ సురేష్‌బాబు, సిబ్బంది రాజు, విష్ణు, భాస్కర్ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రమణకుమార్



ముక్కంటి ఆలయం వద్ద ఉన్న భక్తులు

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం రద్దీ నెలకొంది. వారాంతపు సెలవులు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. 32వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 2,792మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 3,058మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,612మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,141, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 304మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 240మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 55మంది భక్తులు పూజలు చేయించారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 20,682 అమ్ముడైనట్లు తెలిపారు.



మాట్లాడుతున్న సీఐ హుస్సేన్‌బాషా

తండ్రి హత్య కేసులో తనయుడి అరెస్టు

వాకాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుగరాజపట్నం పంచాయతీ శ్రీనివాసపురం గిరిజన కాలనీలో తండ్రిని చంపిన కేసులో నిందితుడిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. గతనెల 31వ తేదీన తుపాకుల రమేష్ తన తండ్రి చిన్నరామయ్యను హత్యచేసిన విషయం విదితమే. మద్యం మత్తులో తలపై కర్రతో కొట్టడంతో చిన్నరామయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. పరారైన రమేష్‌ను శనివారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ హుస్సేన్‌బాషా తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐ నాగబాబు పాల్గొన్నారు.

సముద్ర ముఖద్వారాల పరిశీలన

వాకాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడిరాయదొరువు, కొండూరుపాళెం సముద్ర ముఖద్వారాలను శనివారం మత్స్యశాఖ కమిషనర్ డోలా శంకర్, జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజు ప్రత్యేక అధికారులతో కలసి పరిశీలించారు. శంకర్ మాట్లాడుతూ రూ.97కోట్లతో పూడిరాయదొరువు వద్ద పులికాట్ సరస్సులోని ముఖద్వారాల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయన్నారు. తూపిలిపాళెం, కొండూరుపాళెం వద్ద ఉన్న ముఖద్వారాలను క్షేత్రస్థాయిలో పరిశీలించామని తెలిపారు. తీర ప్రాంతాల్లోని గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని, మత్స్యకారుల జీవన ప్రమాణాల మెరుగునకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవోలు రఘుబాబు, రెడ్యానాయక్, డీఎఫ్‌ఏ తదితరులు పాల్గొన్నారు.



పూడిరాయిదొరువు వద్ద సముద్ర ముఖద్వారాలను పరిశీలిస్తున్న మత్స్యశాఖ కమిషనర్ డోలా శంకర్

5న పెద్దశేష వాహనం

తిరుమల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఈనెల 5వ తేదీన నాగులచవితి సందర్భంగా తిరుమలలో పెద్దశేష వాహనంపై మలయప్పస్వామి దర్శనమివ్వనున్నారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు ఉభయ దేవేరులతో కలిసి నాలుగు మాడవీధుల్లో ఊరేగనున్నారు. సర్పరాజైన ఆదిశేషువు జగన్నాథునికి నివాస భూమిగా, తల్పంగా, సింహాసనంగా సేవలందించినట్లు పురాణాలు చెబుతున్నాయి.

ఆటోడ్రైవర్ దారుణ హత్య

● స్నేహితుడే కాలయముడైన వైనం

శ్రీకాళహస్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్నేహితుడే కాలయముడై ఆటోడ్రైవర్ నాగరాజు(28)ను దారుణంగా హతమార్చాడు. ఈ ఘటన తొట్టంబేడు మండలంలోని శివనాథపురం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. తొట్టంబేడు ఎస్‌ఐ ఈశ్వరయ్య కథనం మేరకు.. శ్రీకాళహస్తి పట్టణం బీపీ అగ్రహారానికి చెందిన నాగరాజు ఆటోడ్రైవర్‌గా .జీవనం సాగిస్తున్నాడు. శ్రీకాళహస్తి పట్టణం బహదూరుపేటకు చెందిన పద్మావతి గంగను ప్రేమించి వివాహం చేసుకున్నాడు. వీరు శివనాథపురం పంచాయతీ పరిధిలో అద్దె ఇంట్లో కాపురం పెట్టారు. తిరుపతికి చెందిన రాజేష్ అదే ప్రాంతంలో నివాసం ఉంటూ ఆటో నడుపుకునేవాడు. ఇద్దరు కలిసి మద్యం తాగుతూ తరచూ సెంట్రింగ్ పనులకు కూడా వెళ్లేవారు. రాజేష్ నాగరాజు కుటుంబంతో సన్నిహితంగా ఉండేవాడు. ఈ కారణంగా కొన్ని రోజులుగా నాగరాజు దంపతుల మధ్య విబేధాలు తలెత్తాయి. శుక్రవారం రాత్రి ఇద్దరు గొడవపడ్డారు. సర్ది చెప్పేందుకు రాజేష్ అక్కడికి వెళ్లాడు. ఇంతలో నాగరాజు రాజేష్ పట్ల దురుసుగా ప్రవర్తించాడు. ఆగ్రహానికి గురైన రాజేష్ బండరాయితో నాగరాజు తలపై బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పద్మావతి గంగ తొట్టంబేడు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పరారీలో ఉన్న రాజేష్ కోసం గాలింపు చేపట్టారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు సాగిస్తున్నారు. శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నాగరాజు మృతదేహం

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.38 కోట్లు

తిరుమల, నవంబరు2(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2.38 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి, శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 67,785 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 27,723 మంది తలనీలాలు సమర్పించారు.

కార్తీకమాస మహోత్సవాలు ప్రారంభం

తిరుపతి అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తిరుపతి కపిలేశ్వరస్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన గణపతి హోమంతో కార్తీకమాస మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో నెల రోజులు ప్రత్యేక హోమాది క్రతువులు నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం విశేషంగా స్నపన తిరుమంజనం నిర్వహించి, అలంకరణ చేపట్టారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

రూ.5.28 కోట్లతో రోడ్ల అభివృద్ధి: పాశం


రోడ్డు మరమ్మతుల పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశం

గూడూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారులను రూ.5.28 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం గూడూరు మండలంలోని చెన్నూరు నుంచి తిప్పవరప్పాడు వరకు రోడ్డు మరమ్మతుల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో రోడ్లు గుంతలమయంగా మారడంతో ప్రజలు అవస్థలు పడాల్సి వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రోడ్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిందన్నారు. గూడూరు నియోజకవర్గ పరిధిలో సుమారు 60 కిలోమీటర్ల మేర రహదారుల్లోని గోతులను పూడ్చేందుకు ప్రభుత్వం రూ.5.28 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో మిషన్ పాట్ హోల్‌ఫ్రీ ఏపీ కార్యక్రమంలో భాగంగా గూడూరు - రాజంపేట రహదారి మార్గంలో 6 కిలోమీటర్ల రహదారిని రూ.65 లక్షలతో అభివృద్ధి చేసే పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మట్టం శ్రావణి, పెంచలయ్య, దుద్దా రాఘవరెడ్డి, శివకుమార్, సురేష్, ఆర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు


ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న తహసీల్దారు

డక్కిలి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు శ్రీనివాసులు హెచ్చరించారు. మండలంలోని వెలికల్లు గ్రామ సర్వే నెంబరు 249-22లో 18 ఎకరాల ప్రభుత్వ మేత పోరంబోకు భూములను కొందరు ఆక్రమించడంతో శనివారం తహసీల్దారు వెళ్లి అడ్డుకొన్నారు. ప్రభుత్వ భూమిలోకి ఎవ్వరూ ప్రవేశించరాదంటూ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా తగు చర్యలు తీసుకొంటున్నట్లు తెలిపారు. మండలంలో ఎక్కడైనా ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైతే తనకు సమాచారం ఇస్తే చర్యలు తీసుకొంటామని చెప్పారు. తహసీల్దారు వెంట సర్వేయరు రాజగోపాల్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు


మహిళకు సభ్యత్వం ఇస్తున్న టీడీపీ నాయకులు

కోట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉత్తమనెల్లూరులో శనివారం టీడీపీ సభ్యత్వ నమోదు ముమ్మరంగా సాగింది. టీడీపీ నేత, సెంట్రల్ బ్యాంక్ మాజీ వైస్ ఛైర్మన్ నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జిలు పొక్కాలి బాలాజీశెట్టి, పొక్కాలి సుధాకర్‌శెట్టి ఆధ్వర్యంలో ఉత్తమనెల్లూరు, తాటిగుంట చెరువు గ్రామాల్లో టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. పార్టీ సభ్యత్వం తీసుకుంటే కలిగే బీమా సౌకర్యం గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తీగల సురేష్‌బాబు, కొనిశెట్టి రమేష్, కోటేశ్వర్‌రెడ్డి, కోటేశ్వరరావు, పుట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

పరసాకు టీడీపీ నేతల పరామర్శ


మాజీమంత్రి పరసా రత్నంతో టీడీపీ నాయకులు

పెళ్లకూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి డాక్టర్ పరసారత్నం గుండె ఆపరేషన్ చేసుకుని తిరుపతిలోని ఆయన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. శనివారం పెళ్లకూరు మండలంలోని పలువురు టీడీపీ నేతలు పరసాను కలిసి పరామర్శించారు. ఆయన ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు, కొత్తూరు సర్పంచు సంచి కృష్ణయ్య, ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు, జీలపాటూరు సర్పంచు కందమూడి శివకుమార్, టీడీపీ సీనియర్ నాయకులు దామెర ప్రసాద్‌నాయుడు, మునీష్, మురళీనాయుడు, సిద్దులయ్య నాయుడు తదితరులు ఉన్నారు

ఆస్పత్రికి వెళ్లి వృద్ధురాలికి పింఛను అందజేత


అమీర్‌బీకి పింఛను అందజేస్తున్న రమ్య

గూడూరు అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక దిగువ వీరారెడ్డిపల్లికి చెందిన అమీర్‌బీ అనే వృద్ధు రాలు అనారోగ్యంతో నెల్లూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. సచివాలయ అడ్మిన్ రమ్య శని వారం నెల్లూరుకు వెళ్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అమీర్‌బీకి పింఛను అందజేశారు. వృద్ధురాలి కుటుంబ సభ్యులు రమ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు జిల్లా విద్యార్థులు

తిరుచానూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీలు జరిగాయి. అండర్-14 విభాగంలో 11మంది బాలురు, అండర్-17 విభాగంలో బాలురు 13మంది, బాలికలు 15మంది రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు హెచ్ఎం మురళి తెలిపారు. మచిలీపట్టణంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని చెప్పారు. జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచిన వారికి పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. రెఫరీగా తిరుచానూరు జడ్పీ ఉన్నత పాఠశాల పీడీ సురేంద్రబాబు, పళని వ్యవహరించారు. విద్యార్థులను అధ్యాపకులు ప్రభాకర్, పూర్ణచంద్ర, వెంకటముని అభినందించారు.

ప్రమాదవశాత్తు షిఫ్ట్ ఆపరేటర్ మృతి


గోపీకృష్ణ మృతదేహం

గూడూరు అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక చవటపాళెం సమీపంలోని ఓ ప్రైవేటు కర్మాగారంలో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న యువకుడు ప్రమాదవశాత్తు మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. రెండోపట్టణ పోలీసుల వివరాల మేరకు.. నెల్లూరు జిల్లా కోవూరు గ్రామానికి చెందిన గోపీకృష్ణ(35) చవటపాళెం సమీపంలోని ఓ కర్మాగారంలోని కోర్‌షాపులో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు మిషన్ పరికరాలు గోపీకృష్ణ తలకు తగలడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పెరుగుతున్న నేరాలు... హడలిపోతున్న ప్రజలు

గూడూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గంలో మునుపెన్నడూ లేనివిధంగా ఇటీవల హత్యలు, హత్యాయత్నాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రశాంతతకు మారు పేరుగా ఉన్న నియోజకవర్గంలో రోజురోజుకు పెరుగుతున్న నేరాలతో నియోజకవర్గ ప్రజలు హడలిపోతున్నారు. సెప్టెంబరు 10వ తేదీన చిల్లకూరు మండలం తొణుకుమాల గ్రామంలో ఓ తోట వద్ద కాపలాదారులుగా ఉన్న అంకయ్య, వెంకటేశ్వర్లు మధ్య నగదు విషయమై వివాదం తలెత్తింది. ఈ క్రమంలో వెంకటేశ్వర్లును అంకయ్య హత్యచేసి తెలుగుగంగ కాలువ సమీపంలో పూడ్చిపెట్టాడు. అదేవిధంగా గూడూరు మండలంలోని చెన్నూరు గ్రామంలో సెప్టెంబరు 24వ తేదీన మనస్పర్థల కారణంగా రమేష్ అనే వ్యక్తి అత్త వరసైన ఆనందమ్మను నిద్రిస్తున్న సమయంలో కర్రతో కొట్టి హత్యచేశాడు. చిల్లకూరు మండలం వరగలి గ్రామంలో లాసిక్ అనే 11 ఏళ్ల బాలుడిని వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భావించి కోట మండలం కొక్కుపాడు గ్రామానికి చెందిన అనిల్ వరగలి గ్రామానికి చెందిన చరణ్ సాయంతో గత నెల 7వ తేదీ ఉప్పుటేరులో ముంచి చంపేశారు. చిల్లకూరు మండలం కమ్మవారిపాళెం గ్రామానికి చెందిన మనోజ్ గత నెల 11వ తేదీన తల్లి సుశీలమ్మ మందలించడంతో కర్రతో కొట్టి హత్య చేశాడు. గత నెల 22వ తేదీన చిల్లకూరు మండలం నాంచారమ్మపేట గ్రామంలో టీడీపీ కార్యకర్త హరిప్రసాద్‌ను అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు రాజకీయ కక్షల కారణంగా దారుణంగా దాడిచేసి హత్య చేశారు. గత నెల 31న చిల్లకూరు మండలం కడివేడు గ్రామానికి చెందిన వెంకటేష్‌ను పాత కక్షల నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం దారుణంగా దాడిచేసి హత్య చేశాడు. వాకాడు మండలం శ్రీనివాసపురం గిరిజనకాలనీలో నివాసముంటున్న చిన్నరామయ్యపై అతని కుమారుడు రమేష్‌కు మద్యం మత్తులో దాడి చేయడంతో మృతిచెందిన సంఘటన గత నెల 31న చోటు చేసుకుంది. అదేవిధంగా అక్టోబరు 2వ తేదీ గూడూరులో జరిగిన జెండా ఉత్సవాల్లో డీజేల వద్ద తగాదాలలో ముగ్గురు యువకులు కత్తి పోట్లుకు గురైన విషయం తెలిసిందే. గత నెల 14వ తేదీన స్థానిక ఇందిరానగర్‌లో ఆస్తి విషయమై తలెత్తిన వివాదంలో కృష్ణారావు, ధనలక్ష్మి దంపతులపై వారి అల్లుడు సుబ్రహ్మణ్యం కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. ప్రశాంతంగా ఉండే గూడూరు నియోజకవర్గంలో ఇటీవల వరుసగా జరుగుతున్న ఘటనలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. నేరాల సంఖ్యను నియంత్రించడంతో పాటు నేర ప్రవృత్తి పెరగకుండా పోలీసులు పటిష్ఠ చర్యలు చేపట్టి ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

గూడూరు అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రబీ వరిసాగులో సేంద్రియ ఎరువులను వినియోగించడం వల్ల అధిక దిగుబడులను సాధించవచ్చునని వ్యవసాయశాఖ జిల్లా ట్రైనింగ్ కోఆర్డినేటర్ భాస్కరయ్య అన్నారు. శనివారం స్థానిక రైతుసేవా కేంద్రంలో సిబ్బంది సామర్థ్యాల పెంపుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలాల్లో పశువుల ఎరువు, పచ్చిరొట్ట అధికంగా వినియోగించడం వల్ల నేల సారవంతమై దిగుబడిలు అధికంగా వస్తాయన్నారు. విస్తరణ సిబ్బంది ఎప్పటికప్పుడు సాగులో సాంకేతిక అంశాలను తెలుసుకుని వాటిని రైతులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు వేణుగోపాలరావు, కార్తీక్, గోపి నాయక్, చెంచురెడ్డి, రమేష్, భవానీ, విజయలక్ష్మి, రాధాకృష్ణారెడ్డి పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ జిల్లా ట్రైనింగ్ కోఆర్డినేటర్ భాస్కరయ్య

సరైన డేటాను అప్‌లోడ్ చేయండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ రాధమ్మ

గూడూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మెప్మా గ్రూపుల్లోని సభ్యులకు సంబంధించి సరైన డేటాను ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్‌లో అప్‌లోడ్ చేసేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ రాధమ్మ అన్నారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో మెప్మా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఐదేళ్లుగా మెప్మా సైట్‌లో గ్రూపు సభ్యులు మారినా, బ్యాంకులు మారినా, ఇతర మార్పులు జరిగివున్నా ఇప్పటి వరకు సైట్‌లో ఎలాంటి మార్పులు చేసేందుకు అవకాశం లేకుండా పోయిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించాలనే ఉద్దేశంతో సెల్ఫ్‌హెల్ప్ గ్రూపు ప్రొఫైలింగ్ యాప్‌ను ప్రవేశపెట్టిందన్నారు. ఈయాప్‌లో కొత్తసభ్యుల డేటా, ఇతర వివరాలను కూడా నమోదు చేసుకునే వీలుందన్నారు. కార్యక్రమంలో పెంచలయ్య, గోపి, కృష్ణవేణి, ప్రమీల, భాస్కర్, చందన, వసంత తదితరులు పాల్గొన్నారు.

చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

గూడూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని డీఎస్పీ రమణకుమార్ అన్నారు. శనివారం స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం చేకూరి ఆరోగ్యంగా ఉంటామన్నారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడలో రాణించేందుకు కృషి చేయాలన్నారు. క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జాతీయ హాకీ క్రీడాకారుడు భానుప్రకాష్ బహుమతులను అందజేశారు. కార్యక్ర మంలో కళాశాల డైరెక్టర్ దత్తాత్రేయశర్మ, ప్రిన్సిపాల్ రవిప్రసాద్, విశ్వక్సేనారెడ్డి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్పీ రమణకుమార్

శ్రీకాళహస్తీశ్వరాలయ భూముల వేలం


వేలంపాటలు నిర్వహిస్తున్న దేవదాయశాఖ అధికారులు

నాయుడుపేట టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణ పరిధిలోని విన్నమాల గ్రామంలో వెలసిన్న శ్రీకాళహస్తీశ్వర, వేణుగోపాలస్వామి ఆలయాలకు సంబంధించిన భూములకు శనివారం వేలం పాటలు నిర్వహించారు. 19 ఎకరాలకు వేలం పాటలు నిర్వహించగా రూ.1,50,100కు రైతులు లీజు హక్కులు దక్కించుకున్నట్లు ఈవో రవికృష్ణ తెలిపారు. అయితే నిబంధనల ప్రకారం ముందుగా సమాచారం ఇవ్వకుండా దేవదాయశాఖ అధికారులు వేలంపాటలు నిర్వహించడం పట్ల విమర్శలు వ్యక్తమయ్యాయి.

ఓటు వేయలేదని పింఛను ఆపేశారు!


సదరం ధ్రువీకరణ పత్రం చూపుతున్న పోలయ్య

బాలయపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఓటు వేయలేదని పింఛను నిలిపివేశారని బాలయపల్లి గ్రామానికి చెందిన ఉల్లిపాయల పోలయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. శనివారం బాలయపల్లి సచివాలయం వద్దకు వచ్చిన ఆయన తాను 2010 నుంచి దివ్యాంగుల పింఛను పొందుతున్నానని తెలిపాడు. ఇందుకు సంబంధించిన సదరం ధృవీకరణ పత్రాన్ని మీడియాకు చూపించాడు. అధికార పార్టీకి చెందిన బాలయపల్లి సర్పంచు ఘట్టం అంజలి ఫిర్యాదుతో అధికారులు పింఛను ఇవ్వకుండా నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఉన్నతాధికారులు స్పందించి పింఛను ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరాడు.

ఆలయాల్లో కార్తీక శోభ


నాగేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

సూళ్లూరుపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని శివాలయాల్లో కార్తీక మాస శోభ సంతరించుకొంది. పట్టణంలోని నాగేశ్వరస్వామి, టీడీపీ కార్యాలయం వద్దనున్న అభయ శంకరుని ఆలయం, మన్నారుపోలూరులోని సంతానేశ్వరిస్వామి, కల్యాణేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు కావాల్సిన ఏర్పాట్లు చేశారు.

గూడలిలో కార్తీకమాస పూజలు

కోట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలి కామాక్షీదేవి సంఘమేశ్వర ఆలయంలో శనివారం కార్తీకమాస ప్రారంభపూజలు జరిగాయి. ఆలయ ప్రధానార్చకుడు కార్తీక్‌స్వామి ఆధ్వర్యంలో సంఘమేశ్వరుడి విగ్రహానికి పలు అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక హోమాలు జరిగాయి. అనంతరం సంఘమేశ్వరుడు, కామాక్షీదేవి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

పెళ్లకూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన చిల్లకూరు వడ్డిపాలెం గ్రామానికి చెందిన బండి చెంచయ్య కుటుంబానికి వైసీపీ నాయకులు రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. శనివారం మండలంలోని చిల్లకూరులోని ఎన్డీసీసీబీ మాజీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి నివాసానికి చేరుకున్న ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మీడియాతో మాట్లాడారు. పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం వడ్డిపాలెం గ్రామానికి చేరుకుని మృతుడి భార్య ప్రమీలమ్మకు రూ.లక్ష చెక్కు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలతో పేరం సమావేశం


ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, గాలి భానుప్రకాశ్‌తో వెంకటతేజ

పెళ్లకూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో నిర్వహించిన ఐటీ సినర్జీ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలతో ప్రవాస భారతీయుడు, టీడీపీ యువనేత పేరం వెంకటతేజ సమావేశమయ్యారు. ఐటీ సినర్జీ కార్యక్రమానికి గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, నగిరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ ప్రత్యేక అతిథిలుగా హాజరయ్యారు అమెరికాలో అధ్యాపకుడుగా పనిచేస్తున్న పేరం వెంకటతేజ శనివారం ఎమ్మెల్యేలను కలిసి పలు అంశాలను చర్చించారు.

ఉత్తమనెల్లూరులో గ్రామసభ


సభలో మాట్లాడుతున్న తహసీల్దారు జయజయరావు

కోట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉత్తమనెల్లూరులో శనివారం తహసీల్దారు జయజయరావు, సర్వేయర్ల ఆధ్వర్యంలో భూముల రీసర్వేపై గ్రామసభ జరిగింది. పంచాయతీలోని పలు గ్రామాల రైతులు భూ సమస్యలపై 23 అర్జీలను ఇచ్చారు.

ఉపాధ్యాయులకు అభినందనలు

కోట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడలి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు రాధయ్య ఉద్యోగ విరమణ పొందారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈవో మస్తానయ్య ఆధ్వర్యంలో రాధయ్య దంపతులను షీల్డులు, జ్ఞాపికలతో సత్కరించారు.


రాధయ్య దంపతులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఫ్రీహోల్డ్ భూములపై సమగ్ర విచారణ

ఓజిలి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలంలో ఫ్రీ హోల్డ్ భూములపై సమగ్ర విచారణ జరుగుతోంది. గత వారం రోజులుగా వీఆర్వోలు ఫ్రీ హోల్డ్ భూముల వివరాల సేకరణకు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో 2003కు ముందు అసైన్‌మెంట్ భూములను ఫ్రీ హోల్డ్ చేస్తూ పట్టాదారుకు పూర్తిస్థాయిలో హక్కులు కల్పించారు. ఈ క్రమంలో ఓజిలి మండలంలోని 26పంచాయతీల పరిధిలో సుమారుగా 1275 ఎకరాలకు పైగా భూములు ఫ్రీ హోల్డ్ కింద మారాయని సమాచారం. సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్‌లోని ఓజిలి మండలంలోనే ఎక్కువ భూములు ఫ్రీ హోల్డ్ కిందకు మారాయని తెలిసింది. ఇలా ఫ్రీహోల్డ్ అయిన భూములను లబ్ధిదారుల నుంచి కొందరు రాజకీయ నేతలు తమ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లను నిలిపివేసింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో ఫ్రీ హోల్డ్ భూముల వివరాల సేకరణలో వీఆర్వోలు తలమునకలై ఉన్నారు. ఈ విషయమై తహసీల్దారు పద్మావతిని వివరణ అడగగా ఫ్రీ హోల్డ్ భూముల వివరాల సేకరణ జరుగుతోందని, మరో వారంలో పూర్తి వివరాలు సేకరించి సూళ్లూరుపేట ఆర్డీవోకు నివేదిక పంపనున్నట్లు తెలిపారు.

సీఎం చంద్రబాబుతోనే అభివృద్ధి: నెలవల


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

తడ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. శనివారం కొండూరు, కాదలూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతుల పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సూళ్లూరుపేట నియోజకవర్గంలో సుమారు 105 కిలోమీటర్ల మేర ఆర్‌అండ్‌బీ రోడ్లు గుంతలమయమయ్యాయని, వాటిని మరమ్మతు చేసేందుకు రూ.4.20 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. సంక్రాంతి పండుగ లోపు రోడ్ల మరమ్మతులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈ పరమేశ్వరి, టీడీపీ నాయకులు మురళీరెడ్డి, వేనాటి రాజారెడ్డి, పార్థసారథి, సుధాకర్‌రెడ్డి, శ్యామ్‌రెడ్డి, సర్పంచ్ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

చెరువుల్లో వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోండి

చిల్లకూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడివేడు, తిమ్మనగారిపాళెం, కమ్మవారిపాళెం, గుత్తావారిపాళెం గ్రామాల చెరువుల్లో వ్యర్థాలు వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం ఆయా గ్రామాల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాలకు సమీపంలోని అపెక్స్ కంపెనీ నుంచి రబ్బర్ వ్యర్థాలతో పాటు కృష్ణపట్నం పోర్టు నుంచి కూడా వ్యర్థాలను తీసుకువచ్చి చెరువుల్లో వేస్తున్నారన్నారు. ఈ విషయమై సోమవారం గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముత్యాలయ్య తదితరులు పాల్గొన్నారు.

డిసెంబరు 6న అయ్యప్ప జ్యోతుల గ్రామోత్సవం


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

సూళ్లూరుపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ఏటా నిర్వహించే అయ్యప్పస్వామి జ్యోతుల గ్రామోత్సవ ప్రచార పోస్టర్లను శనివారం షార్ బస్టాండు వద్దనున్న ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ ఏడాది డిసెంబరు 6న సూళ్లూరుపేటలో 26వ వార్షికోత్సవ జ్యోతుల గ్రామోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు కె.లీలా మోహన్‌రెడ్డి, కె.చంద్రమౌళిరెడ్డి, వీకే.రాజగోపాల్, సత్యనారాయణ, సుబ్బారావు, మల్లికార్జున్ పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు


భక్తులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

చిల్లకూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీసేవ జరిపి ఊరేగించారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు.

పేద విద్యార్థికి చేయూత


విద్యార్థికి నగదు అందజేస్తున్న సీతారామ ధార్మిక సంస్థ ప్రతినిధులు

కోట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా కొవూరుకు చెందిన పేద విద్యార్థి మహేష్‌కు కోట మండల పరిధిలోని విద్యానగర్‌లో శనివారం సీతారామ ధార్మిక సంస్థ ఆధ్వర్యంలో రూ.6వేల నగదు అందజేశారు. మహేష్ ఎంసీఏ చదివేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదురుకావడంతో సీతారామ ధార్మిక సంస్థ ఆధ్వర్యంలో దాతలు నందగోపాల్, శేషాద్రిశర్మ, వెంకటేష్ దాతృత్వంతో రూ.6వేల నగదు అందజేశారు.

శాస్త్రోక్తంగా శనీశ్వరస్వామికి తైలాభిషేకం



శ్రీకాళహస్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని శనీశ్వరస్వామికి శనివారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అభిషేకానంతరం శనీశ్వరస్వామి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ చేసి మొదట గణపతి పూజ, కలశపూజను చేశారు. స్వామివారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. కాగా అభయ శ్రీవెంకటేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగలు, పుష్పాలతో సుందరంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

వరదయ్యపాళెం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతిచెందిన ఘైనమిది. వివరాలివి.. గోవర్ధనపురానికి చెందిన కల్లూరి సుదేవ్ అతని స్నేహితులు మూడు రోజుల క్రితం నాయుడుపేటకు వెళ్లి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో సుదేవ్ అనే యువకునికి తీవ్రగాయాలయ్యాయి. అతనిని స్విమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఇతడి తండ్రి భాస్కర్ బస్టాండులో హమాలీగా పనిచేస్తున్నాడు. కుమారుని చికిత్స కోసం రూ.5లక్షలు వరకు ఖర్చు చేశాడు. అయినా దక్కకపోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ఉద్యోగ విరమణ చేసిన వర్క్ ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్థానిక తెలుగు గంగ కార్యాలయంలో వర్క్‌ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తూ పదవీ రిటైరైన దేవకుమార్‌ను డీఈఈ పెంచలయ్య, సిబ్బంది శనివారం సన్మానించారు. దేవకుమార్ సేవలను విశ్రాంత డీఈఈలు ప్రసాద్, రాఘవరెడ్డిలు కొనియాడారు. కార్యక్రమంలో ఏఈఈలు ఖాసీ, వైశాలి, మునిరాజా, గాయిత్రి, భాస్కర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్నారని ఫిర్యాదు

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గాజులపెళ్లూరు చెరువులోని మట్టిని అనుమతులు లేకుండా తరలిస్తున్నారని గ్రామస్థులు అధికారులకు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువులోని మట్టిని కొందరు జేసీబీలు, ట్రాకర్ల ద్వారా ఇష్టానుసారం తరలించడం వలన చెరువులో గుంతలు ఏర్పడుతున్నాయన్నారు. ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోలేదన్నారు. తక్షణం మట్టి తరలింపును అడ్డుకోవాలని కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మంత్రి నాదెండ్ల మనోహర్‌కు జనసేన నేతల స్వాగతం



మంత్రికి స్వాగతం పలుకుతున్న వినుత, చంద్రబాబు తదితరులు

రేణిగుంట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు తిరుపతి విమానాశ్రయంలో శనివారం ఘనస్వాగతం లభించింది. ఆయనకు ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, డీఎస్పీ శ్రీనివాసులు, జిల్లా డీఎం సుమతి, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి రాజు, ఇన్‌చార్జి తహసీల్దారు శ్యాంప్రసాద్, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, శ్రీకాళహస్తి జనసేన ఇన్‌చార్జి కోట వినుత, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, జనసేన నాయకులు కిరణ్‌రాయల్, రాజారెడ్డి, కార్యకర్తలు స్వాగతం పలికారు.

టీడీపీ సభ్యత్వం తీసుకోండి

రేణిగుంట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులు, అభిమానులు, యువత పార్టీ సభ్యత్వం తీసుకోవాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు మునీర్ కోరారు. శనివారం మైనార్టీ నాయకులతో కలిసి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు అఫ్రోజ్, గులాబ్‌ఖాన్, భాస్కర్, శీన, నరకేసరి, కుమార్, మున్నా, కరీముల్లా, తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ సభ్యత్వ నమోదులో మునీర్ తదితరులు

చిన్నారి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

కేవీబీపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాధిత చిన్నారి కుటుంబాన్ని ఎమ్మెల్యే సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శనివారం రాత్రి పరామర్శించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వ పక్షాన ప్రకటించిన రూ.10లక్షల ఆర్థిక సాయం కూడా ఆదివారం హోంమంత్రి అనిత అందజేస్తున్నారని తెలిపారు. ధైర్యంగా ఉండాలన్నారు. నిందితుడిని కఠిన చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం సిద్ధం ఉందన్నారు. నాయకులు మల్లికార్జునరెడ్డి, జయరామిరెడ్డి, ఇళంగోవన్‌రెడ్డి, నాగలాపురం మాజీ ఎంపీపీ మురళి, సాధు, ఎంపీటీసీ సెల్వకుమార్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్యరూపకాలు

శ్రీకాళహస్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని బ్రహ్మగుడి వద్ద కార్తీక మాసోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పలువురు ప్రదర్శించిన నృత్య రూపకాలు భక్తులను అలరించాయి. కళాకారులు పలు భక్తిగీతాలకు నృత్యప్రదర్శన చేశారు. వారికి ఆలయ అధికారులు స్వామి అమ్మవారి జ్ఞాపిక, తీర్థప్రసాదాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.



పుత్తూరు వార్తలు

గ్రావెల్ తరలింపుపై ఫిర్యాదు

వడమాలపేట, నవంబర్ 2(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా గ్రావెల్ తరలిస్తున్న వాహనాలపై తహసీల్దార్ ఎస్‌ఐలకు స్థానికులు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ ఆదేశాలతో శుక్రవారం అర్ధరాత్రి డిప్యూటీ తహసీల్దార్ సుధీర్ సంఘటనా స్థలానికి వెళ్లి వాహనాలను అడుకున్నారు. తహసీల్దార్‌కు పూర్తి స్థాయిలో వివరాలను నివేదించారు. జరిమానా విధించి ఒక హిటాచి, రెండు టిప్పర్లు, ఎనిమిది ట్రాక్టర్లపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. వాహనాలను సీజ్ చేసి చర్యలు చేపట్టాలన్నారు.

గ్రామీణ రోడ్ల మరమ్మతులకు ప్రాధాన్యత

వడమాలపేట, నవంబర్ 2(ఆంధ్రజ్యోతి): గ్రామీణ రోడ్ల మరమ్మతు పనులకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు చెప్పారు. శనివారం మండలంలోని పాదిరేడు నుంచి పాపానాయుడు పేట రోడ్డు మరమ్మతు పనులను ఆయన ప్రారంభించారు. రూ.2.20 లక్షల వ్యయంతో చేపడుతున్న ప్యాచ్ వర్క్ పనులను వేగవంతంగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు కార్యక్రమంలో రోడ్లు భవనాల శాఖ డీఈ అమర్నాథ రెడ్డి, ఏఈ ఇజ్రాయిల్, టీడీపీ నాయకులు దాముయాదవ్, కృష్ణమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమానికి టీడీపీ పెద్దపీట



కార్యకర్తలకు గుర్తింపు కార్డులు అందజేసిన మాధవయ్య

పుత్తూరు అర్బన్, నవంబర్ 02(ఆంధ్రజ్యోతి): పార్టీకి మూల స్తంభాల్లాంటి కార్యకర్తలు, వారి కుటుంబ సభ్యుల సంక్షేమానికి టీడీపీ పెద్దపీట వేస్తుందని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్, మాజీ ఎంపీపీ గంజి మాధవయ్య పేర్కొన్నారు. శనివారం పుత్తూరు రూరల్ మండలం పరమేశ్వర మంగళం గ్రామపంచాయతీ కైలాసపురంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం పండుగ వాతావరణంలో సాగింది. ముఖ్య అతిథిగా మాధవయ్య హాజరయ్యారు. రూ.100 సభ్యత్వంతో రూ.5 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. వాట్సప్, టెలిగ్రామ్, టీడీపీ వెబ్‌సైట్ ద్వారా సభ్యత్వ నమోదు చేసుకోవచ్చన్నారు. టీడీపీ సభ్యత్వ నమోదు అనంతరం కార్యకర్తలకు గుర్తింపు కార్డులను మాధవయ్య అందజేశారు. కార్యక్రమంలో పుత్తూరు రూరల్ పార్టీ ప్రధాన కార్యదర్శి బాలాజీ, తడుకు సర్పంచ్ వెంకటేష్, మాజీ సర్పంచ్ జయశేఖర్, టీడీపీ నాయకులు శ్రీకాంత్, క్రిష్ణ కుమార్, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరులో 4న జాబ్‌మేళా

పిచ్చాటూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈనెల 4న నిర్వహించే జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి కోరారు. శనివారం ఆయన పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్, డైకిన్, సెవెన్ హిల్స్ ఎంటర్‌ప్రైజెస్ తదతర కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. పదో తరగతి లేదా ఇంటర్, ఐటీఐ, డిప్లమా, డిగ్రీలో ఉత్తీర్ణులైన యువతి, యువకులు అర్హులన్నారు. ఆధార్ జిరాక్స్, విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్, బయోడేటాతో నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9440374535 మొబైల్ నంబరులో సంప్రదించాలన్నారు.

నారద పుష్కరిణిలో రేపు లక్ష దీపార్చన

శ్రీకాళహస్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న నారదపుష్కరిణిలో ఈ నెల 4వ తేదీన లక్ష దీపార్చన మహోత్సవం నిర్వహించనున్నట్లు ఈవో చంద్రశేఖర్ ఆజాద్ శనివారం ప్రకటనలో తెలిపారు. కార్తీక మాసం తొలి సోమవారం రోజున సాయంత్రం 5గంటలకు ఈ విశేష దీపోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులందరూ సోమవారం ప్రదోశ కాల సమయంలో మహోత్సవాన్ని వీక్షించవచ్చని తెలిపారు.

బెల్టుషాప్ నిర్వాహకుడి అరెస్టు

● 20మద్యం సీసాల స్వాధీనం



శ్రీకాళహస్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): 20 మద్యం సీసాలతో బెల్టుషాపు నిర్వాహకుడు గిరిబాబు(33)ను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. ఎక్సైజ్ సీఐ లావణ్య కథనం మేరకు పట్టణంలో శనివారం ఎక్సైజ్ పోలీసులు పలు బెల్టుషాపు స్థావరాలపై దాడులు చేశారు. ఇందులో భాగంగా పానగల్ రైల్వేగేటు వద్ద బెల్టుషాపు నిర్వహిస్తున్న గిరిబాబును 20 మద్యం సీసాలతో సహా అదుపులోకి తీసుకున్నారు. రిమాండ్‌కు పంపినట్లు సీఐ లావణ్య తెలిపారు.

సంక్రాంతి నాటికి రోడ్ల మరమ్మతులు పూర్తి

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



ఏర్పేడు మండలం ఎంపీడీవో కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గుంతలు లేని రహదారులే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఏపీసీడ్స్ కూడలి వద్ద శనివారం మిషన్ పాట్ హోల్స్ ఫ్రీ ఏపీ కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రహదారుల మరమ్మతుకలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూ.700కోట్లు మంజూరు చేయడం సంతోషకరమన్నారు. సంక్రాంతిలోగా రాష్ట్రంలో రహదారులపై గుంతలు లేకుండా చేయడమే ప్రభుత్వ ఆశయమన్నారు. నియోజకవర్గంలో దెబ్బతిన్న రోడ్లనుబాగు చేసేందుకు బాగు చేస్తామన్నారు. ఏపీసీడ్స్ కూడలి వద్ద రహదారిపై గుంతలను తారు, కంకర మిశ్రమంతో పూడ్చే పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు విజయకుమార్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చెంచయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు చెప్పండి పరిష్కరిస్తా

ఏర్పేడు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి శనివారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సంబంధిత అధికారులకు పంపి త్వరగా పరిష్కరించాలని సూచించారు. ప్రజల వద్దకే వచ్చి సమస్యను తెలుసుకుని పరిష్కరించే విషయంలో తాను ముందుంటానన్నారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. 200మంది ఇచ్చిన వినతులను స్వీకరించి పరిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దారు భార్గవి, ఎంపీడీవో సౌభాగ్యం, టీడీపీ నాయకులు ధనంజయలునాయుడు, పొన్నారావు, గురవారెడ్డి, శివశంకర్‌రెడ్డి, మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తీశ్వరుడికి వేదోక్తంగా కోటి అర్చన



శ్రీకాళహస్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వేదోక్తంగా కోటి బిల్వ, కుంకుమార్చన వేడుకలను శనివారం ప్రారంభించారు. కార్తీక మాసం విశేషాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. శనివారం ఆలయంలోని సహస్ర లింగం వద్ద ఉదయం శాస్త్రోక్తంగా సంకల్పం నిర్వహించారు. వేదపండితులు కోటి అర్చనకు అంకుర్పార్పణ చేశారు. బిల్వార్చన, అమ్మవారి సన్నిధిలో కుంకుమార్చన కార్యక్రమాన్ని రుత్వికులు 8.45 గంటలకు ప్రారంభించారు. మధ్యాహ్నం వరకు మూడు కాలాల పాటు అర్చనను సాగించారు. సాయంత్రం 5.30గంటల నుంచి 7 గంటల వరకు నాలుగవ కాలం అర్చన చేశారు. తొలి రోజు అర్చన ముగిసింది.

● శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం ఆకాశదీపం కన్నులపండుగగా వెలిగించారు. కార్తీక మాసం పురస్కరించుకుని ప్రతి రోజు ఆకాశదీపాన్ని సాంప్రదాయంగా వెలిగిస్తుంటారు. ఇందులో భాగంగా ఆలయ అధికారులు ఊంజల్‌మండపం వద్ద కార్తీక దీపానికి పూజలుచేశారు. స్తూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. ఈవో చంద్రశేఖర్ ఆజాద్, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఉచిత దంత వైద్య శిబిరం



సత్యవేడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్‌ఎం పాండురంగయ్య ఆధ్వర్యంలో శనివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. తిరుపతికి చెందిన ఫిరోజ్ డెంటల్ ఆస్పత్రి వైద్య నిపుణులు ఫిరోజ్ బాబు, దేవరాజులు బృందం పాఠశాలలోని 200 మంది విద్యార్థులను పరీక్షించారు. దంత సమస్యలు ఉన్న 53 మంది విద్యార్థును గుర్తించి ఉచితంగా మందులను అందించారు. దీంతో పాటు విద్యార్థులకు దంత సంరక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమార్, రఫీ, మురళి, వెంకటేశ్వర్లు, మనోహర్, అన్వర్, భాస్కర్, కృష్ణయ్య శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ల పంపిణీ



శ్రీకాళహస్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగంచేసుకోవాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, టీడీపీ నాయకుడు చెంచయ్యనాయుడు కోరారు. శనివారం మండలంలోని మన్నవరంలో ఆయన లబ్దిదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు సత్వర న్యాయం



న్యాయమూర్తి భీమారావును సన్మానిస్తున్న న్యాయవాదులు

శ్రీకాళహస్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజలకు సత్వర న్యాయం అందించాలని జిల్లా జడ్జి భీమారావు అన్నారు. శనివారం సబ్‌కోర్టు పరిశీలనకు ఆయన వచ్చారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జడ్జి భీమారావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీపీ కన్నలి ప్రభాకర్, కొండేటి కుమార్, మల్లికార్జున, శేఖర్ పాల్గొన్నారు.

సీఐటీయూ నిరసన

పుత్తూరు టౌన్, నవంబర్ 2(ఆంధ్రజ్యోతి): హత్యాచారం కేసులో నిందితుడిని కఠినంగా శిక్షించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించింది. సీఐటీయూ నాయకులు వెంకటేష్ లక్ష్మి, వినోద్, ఎస్ఎఫ్ఐ నాయకులు నరేంద్ర, హర్షద్, గణేష్ పాల్గొన్నారు.

నాటి వైసీపీ తీరుతోనే ఇసుక కష్టాలు: టీడీపీ

సత్యవేడు, నవంబరు 2: గత వైసీపీ ప్రభుత్వ పాలనలో సాగించిన అవినీతి, అక్రమాల వల్లే నియోజకవర్గంలో ఇసుక కొరత ఏర్పడిందని తిరుపతి పార్లమెంట్ ఐటీడీపీ అధ్యక్షుడు యాచేంద్రనాయుడు ఒక ప్రకటనలో విమర్శించారు. నియోజకవర్గంలో ఇసుక కొరత ఏర్పడి భవన నిర్మాణ పనులతో పాటు పారిశ్రామికాభివృద్ధి పనులు మందగిస్తున్నాయనడం సరికాదన్నారు. జగన్ ప్రభుత్వంలో ఆయన సామాజిక వర్గానికి చెందిన పోలీసు, రెవెన్యూ అధికారులను నియమించుకుని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను కూడా లెక్క చేయకుండా అరుణా నదిలో 14 కిలోమీటర్ల మేర 45 అడుగుల లోతు వరకు ఇసుకను తవ్వి తమిళనాడుకు తరలించారన్నారు. అందవల్లే ఇప్పుడు అరుణా నదిలో ఇసుక దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. అప్పట్లో శ్రీసిటీ పేరు చెప్పి చెన్నైకు ఇసుక వందల కోట్లు అక్రమంగా ఆర్జించారన్నారు. వాస్తవానికి శ్రీసిటీలో ఇసుక కొరత లేదన్నారు. చాలాకాలంగా అక్కడి నిర్మాణాలకు రోబో శాండ్ వినియోగిస్తున్నారని గుర్తు చేశారు. పెద్దిరెడ్డి నియోజకవర్గాన్ని గుప్పెట్లో పెట్టుకుని ఇక్కడి మట్టి, ఇసుక, గ్రావెల్, కంకరను హోల్‌సేల్‌గా అమ్ముకున్నారనే సంగతి ప్రజలు మర్చిపోరన్నారు.

ప్రైవేటు బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలు



గాయపడిన కన్నమ్మ,గీత

శ్రీకాళహస్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొని ఇద్దరు మహిళలు గాయపడ్డారు. 2టౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో నంది సర్కిల్ వద్ద శనివారం రాత్రి ఈ ప్రమాదం జరిగింది. వివరాలిలా.. తొట్టంబేడు మండలం బసవయ్యపాళెంకు చెందిన కొందరు మహిళలు అదే గ్రామ శివారులోని నంది సర్కిల్ వద్ద కూరగాయాలు కొనుగోలు చేసేందుకు వెళ్లారు. ఈ క్రమంలో రోడ్డుపక్కన నడచి వెళుతున్న కన్నమ్మ, గీత లను ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొంది. క్షతగాత్రులను స్థానికులు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. రెండవ పట్టణ పోలీసులు వెళ్లి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ప్రమాద ఘటనపై విచారణ చేస్తున్నారు.

చెరువు కలుజు పొరంబోకు ఆక్రమణ



వరదయ్యపాళెం, నవంబరు2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాంబాకం పంచాయతీలో కలుజు పొరంబోకును ఓ స్వచ్ఛంధ సంస్థ ఆక్రమించిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గిరిజనులను అభివృద్ధి పేరిట నడుస్తున్న ఈ సంస్థకు రెండు మండలాల్లో 1,500 ఎకరాల భూమి ఉందన్నారు. అయినా పశువులు, గొర్రెలు, మేకలు మేపుకోవడానికి ఉన్న కొద్దిపాటి భూములను, అటవీ భూములను, బఫర్‌జోన్ పొరంబోకు భూములు మేత ఫెన్సింగ్ వేస్తున్నారని రైతులు పేర్కొన్నారు. ఈ విషయమై వీఆర్వో వివరణ కోరగా తమ దృష్టికి వచ్చిందని ఫెన్సింగ్ తొలగించామన్నారు. విషయాన్ని అధికారులకు తెలియజేశామన్నారు. బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు.

మా ఊరికి శాశ్వత దారి చూపించండి సారూ...

వరదయ్యపాళెం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలం సంతవేలూరు పంచాయతీ సాధనవారిపాళెంలో వేసిన రోడ్డు పరిస్థితి దయనీయంగామారింది. రోడ్డుకు ఇరువైపులా ముళ్లకంపలు పెరిగిపోయాయి. దీంతో తాము నిత్యం అవస్థలు పడుతుననట్లు గ్రామస్థులు తెలిపారు. శనివారం వారు నిరసన తెలిపారు. అత్యవసర సమయంలో ఆస్పత్రికి వెళ్లాలన్నా చాలా అవస్థలు పడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తంచేశారు.



నిరసన తెలుపుతున్న మహిళలు